

www.epapersamayam.com APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

STV SAMAYAM

సంపుటి : 18 | సంచిక : 194 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 23 మార్చి 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల: రూ.5



# దక్షిణాదికి తీవ్ర నష్టం

- పునర్విభజన చేసే పక్షంలో లోక్‌సభలో పెరగనున్న సీట్లలో మా రాష్ట్రాలకు 33% ఇవ్వండి
- సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

**సమయం న్యూస్, హైదరాబాద్:** ''లోక్‌సభలో సీట్ల సంఖ్యను జనాభా ప్రాతిపదికన పునర్విభజన చేస్తే అది దక్షిణాదికి తీవ్ర నష్టం కలిగిస్తుంది. మేం దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోం. ఎందుకంటే అది దక్షిణాది రాష్ట్రాల **తరువాయి 2లో**

## 25, 30 తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

**సమయం న్యూస్, తిరుమల :** శ్రీవారి ఆలయంలో 25, 30వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తితిదే శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. 25న కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం, 30న ఉగాది పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. దీంతో 24, 29వ తేదీల్లో ఎలాంటి సిఫారసు లేఖలు స్వీకరించబోమని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను ఈ నెల 23న స్వీకరించి 24న దర్శనానికి అనుమతించనున్నట్లు తెలిపింది.





## మళ్లీ గ్రామాలకు రెవెన్యూ ఉద్యోగులు

* 10,954 గ్రామ పాలనాధికారుల పోస్టులు మంజూరు చేసిన ఆర్థికశాఖ
* ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా విధులు
* పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలకు అవకాశం..!
* ఇప్పటికే వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ
* మిగిలిన పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు

**సమయం న్యూస్, హైదరాబాద్:** గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు గ్రామ పాలనాధికారి (జీపీవో) పేరుతో కొత్త అధికారులను అందుబాటులోకి తీసుకురానుంది. ఈ నెల 6న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం వీరి నియామకానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా శనివారం 10,954 జీపీవో పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భూమి హక్కులు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జారీ విచారణలు, పథకాలకు అర్హుల ఎంపిక, భూ సర్వేలో సహాయం, విపత్తుల సమాచారం అందజేత, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చేసే కీలక బాధ్యత **తరువాయి 2లో**

# కాంగ్రెస్, భాజపాలతో అణా పైసా పనికాలేదు



- ఈ విషయంపై తెలంగాణ సమాజం ఆలోచించాలి
- భారాస కార్యకర్తల సమావేశంలో కేసీఆర్

**సమయం న్యూస్, హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది మంది భాజపా, ఎనిమిది మంది కాంగ్రెస్ సభ్యులను ప్రజలు గెలిపిస్తే, తెలంగాణకు అణా పైసా పనికూడా కాలేదని భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి భారాస ఎంపీలను పార్లమెంటుకు పంపించి ఉంటే కొట్లాడి మన హక్కులను కాపాడుకునే అవకాశం ఉండేదన్నారు. ''మన దగ్గర ఎంపీల బలం ఉంటే.. కేంద్రం మీద ఒత్తిడి చేసి రాష్ట్రాన్ని బాగుచేసుకునే అవకాశం ఉంటుంది. **తరువాయి 2లో**



## తాత్కాలిక వలసదారులపై ట్రంప్ కొరడా

- 5.32 లక్షల మందికి నివాస హోదా రద్దు!

మియామీ: అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపి వారిని స్వదేశాలకు పంపిస్తోన్న అమెరికా ఇప్పుడు తాత్కాలిక వలసదారులకున్న చట్టపరమైన నివాస హోదాను రద్దు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల నాలుగు దేశాలకు చెందిన 5.32 లక్షల మంది వారి స్వదేశాలకు వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఎదురుకానుంది. క్యూబా, హైతీ, నికరాగువా, వెనెజువెలా దేశాల నుంచి వచ్చిన వలసదారులకు చట్టపరంగా ఉన్న తాత్కాలిక రక్షణను రద్దు **తరువాయి 2లో**

## బెయిల్‌పై పోసాని విడుదల

**సమయం న్యూస్, గుంటూరు:** సినీ నటుడు, వైకాపా మాజీ నేత పోసాని కృష్ణమురళి శనివారం గుంటూరు జిల్లా జైలు నుంచి షరతులతో కూడిన బెయిల్‌పై విడుదలయ్యారు. సీఎం చంద్రబాబు ఫొటోలను మార్ఫింగ్ చేసి, ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కూడా దుర్భాషలాడుతూ గతంలో పోసాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై సీఐడీ పోలీసులు నమోదు చేసిన కేసులో శుక్రవారం జడ్జి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

**తరువాయి 2లో**



## కాలిన నోట్లకట్టల ప్రస్తావన?

* జస్టిస్ యశ్వంత్ వర్మపై ఢిల్లీ సీజే సమర్పించిన నివేదికలో వివరాలు!
* నగదు ఆరోపణల్లో వాస్తవం లేదు: జస్టిస్ యశ్వంత్ వర్మ

**సమయం న్యూస్, ఢిల్లీ:** అగ్ని ప్రమాదం సందర్భంగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ.. శనివారం 25 పేజీల నివేదికను సుప్రీంకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నాకు సమర్పించారు. అందులో జస్టిస్ యశ్వంత్ వర్మ వివరణతోపాటు ఢిల్లీ పోలీసు కమిషనరు అందించిన వివరాలు, ఫొటోలు, వీడియోలు ఉన్నాయి. ఈ నివేదిక మొత్తాన్ని అనూహ్యంగా శనివారం రాత్రి తన వెబ్‌సైట్‌లో సుప్రీంకోర్టు ఉంచింది. నివేదికలో అంతర్గత విచారణ ప్రక్రియ వివరాలూ ఉన్నాయి. అగ్ని మాపకశాఖ ఆపరేషన్

**తరువాయి 2లో**





## నీటి నిల్వతో భవితకు బంగారు బాట

- 1.55 లక్షల పంట కుంటలతో ఒక టీఎంసీ నీళ్లు అందుబాటులోకి
- నాకు కూడా పని లేకపోతే ఉపాధి కూలీగా వెళతా
- త్వరలో అన్ని జిల్లాల్లో పర్యటిస్తా: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

**సమయం న్యూస్, కర్నూలు:** నీటి నిల్వతో భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.55 లక్షల పంట కుంటల ద్వారా ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసుకోవచ్చని చెప్పారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో పంట కుంట నిర్మాణ పనులకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. కుంటను ఉపాధి కూలీలతో కలిసి లాంఛనంగా తవ్వి, రాష్ట్రవ్యాప్తంగా



# దక్షిణాదికి తీవ్ర నష్టం

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ కుదింపు అవుతుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి స్పష్టంచేశారు. ''ఒకవేళ కేంద్రంలోని భాజపా పునర్విభజన ప్రక్రియను తప్పనిసరిగా చేయాలనుకుంటే లోక్‌సభలో పెరగనున్న సీట్లలో దక్షిణాది రాష్ట్రాలకు 33% సీట్లు ఇవ్వాలనేది మా ప్రధాన డిమాండ్. ప్రస్తుతం 543 సీట్లున్న లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య 130. ఇది మొత్తం సీట్లలో 24%. పునర్విభజనతో 50% సీట్లను పెంచాలనుకుంటే 272 సీట్లు అదనంగా పెరుగుతాయి. అప్పుడు మొత్తం లోక్‌సభ సీట్ల సంఖ్య 815 అవుతుంది. అందులో దక్షిణాదికి 33% అంటే 272 సీట్లు ఇవ్వాలి. లేదంటే వచ్చే పాతికేళ్ల పాటు లోక్‌సభ సీట్ల సంఖ్యలో మార్పు చేయవద్దు'' అని ఆయన సూచించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో శనివారం నిర్వహించిన 'న్యాయమైన పునర్విభజన'(ఫెయిర్ డీలిమిటేషన్) సంయుక్త కార్యాచరణ కమిటీ తొలి సమావేశంలో రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే... ''జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలను శిక్షించే విధానానికి కేంద్రం స్వస్తి చెప్పాలి. దేశ నిర్మాణంలో 1975 నుంచి 2025 వరకు అందించిన సేవలకు మనల్ని అభినందించాలి. మనకు వెనక్కి కొంత చెల్లించాలి. జనాభా దామాషా ప్రాతిపదికన చేసే పునర్విభజన చేపట్టొద్దని దక్షిణాది రాష్ట్రాలు చేస్తున్న డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలి. దేశంలోని ఇతర రాష్ట్రాలతో సంబంధం లేకుండా చిన్న రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో లోక్‌సభ సీట్లను ఏర్పాటు చేసినట్లే దక్షిణాదికి అవకాశమివ్వాలి. మంచి ప్రగతి సాధించిన దక్షిణాదికి పార్లమెంటు సీట్లలో మంచి వాటా ఇవ్వడం ద్వారా ఇతర రాష్ట్రాలు ఆర్థికవృద్ధి, సుపరిపాలనపై దృష్టి సారించేలా చేయాలి. ఈ సీట్లను దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరిలకు ఇప్పుడున్న నిష్పత్తి ప్రాతిపదికన పంచవచ్చు.

దేశంలో మిగిలిన సీట్లను ఉత్తరాది, ఇతర రాష్ట్రాలకు కేంద్రం తమ అభిమతం మేరకు పంచవచ్చు. అనుకున్న దానికంటే దక్షిణాదికి సీట్ల సంఖ్య తగ్గిస్తే అది దేశ రాజకీయ రంగంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అందుకే దక్షిణాది రాష్ట్రాలు సైతం రాజకీయ విభేదాలను విస్మరించి పునర్విభజనలో మన వాటా దక్కించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని విన్నవిస్తున్నా. పునర్విభజన ప్రక్రియపై తెలంగాణ శాసనసభలో త్వరలోనే తీర్మానం ఆమోదిస్తాం. మీ రాష్ట్రాల్లోనూ అలానే చేయాలని సహచర ముఖ్యమంత్రులు, నాయకులను కోరుతున్నా. దక్షిణ భారతదేశ పౌరుల గళాన్ని బలంగా దేశం మొత్తానికి వినిపిద్దాం. పునర్విభజన ప్రక్రియపై రెండో సమావేశాన్ని వచ్చే నెలలో హైదరాబాద్‌లో నిర్వహిస్తాను. ఈ పోరాటంలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు భారీ బహిరంగ సభను ఏర్పాటుచేస్తా. దక్షిణ భారత సోదర, సోదరీమణులంతా తరలివచ్చి... మన హక్కుల రక్షణకు కలిసి రావాలని విన్నవిస్తున్నా.

*** భాజపాది జనాభా జరిమానాల విధానం**

జనాభా నియంత్రణపై 1971లో దేశం నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి దక్షిణాది రాష్ట్రాలు దాన్ని విజయవంతంగా అమలు చేస్తే... ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాలు విఫలమయ్యాయి. దక్షిణాది రాష్ట్రాలన్నీ వేగంగా ఆర్థిక వృద్ధిని సాధించాయి. దేశ ఖజానాకు భారీగా నిధులు సమకూరుస్తున్న ఈ రాష్ట్రాలకు తిరిగి.. తక్కువ మొత్తమే దక్కుతోంది. కర్ణాటక పన్నుల రూపంలో కేంద్రానికి రూపాయి చెల్లిస్తే కేవలం 14 పైసలు, తమిళనాడుకు 29 పైసలు, తెలంగాణకు 41 పైసలు, కేరళకు 62 పైసలు వెనక్కి వస్తున్నాయి. అదేసమయంలో బిహార్‌కు రూ.6.06, ఉత్తర్‌ప్రదేశ్‌కు రూ.2.73, మధ్యప్రదేశ్‌కు రూ.1.73 వెనక్కి వెళుతున్నాయి. మరోవైపు దక్షిణాదికి కేంద్రం కేటాయింపులు, పన్ను చెల్లింపులను తగ్గిస్తోంది. మనది ఒకే దేశం... మనం దాన్ని గౌరవిస్తాం. పునర్విభజనను మాత్రం అంగీకరించబోం. ఈ అసమగ్రమైన ప్రక్రియను చేపట్టకుండా మనం భాజపాను అడ్డుకోవాల్సిందే.

ఇదీ నా మొదటి సూచన... అసలు సీట్లను పెంచొద్దు. ఉన్న సీట్లతోనే పునర్విభజన ప్రక్రియ చేపట్టాలి. 1976లో ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అలానే పునర్విభజన చేపట్టింది. లేకుంటే రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానతలు వచ్చేవి. 2001లో వాజ్‌పేయీ నేతృత్వంలోని ప్రభుత్వం పునర్విభజన ప్రక్రియను అలానే ప్రారంభించింది. ప్రస్తుతం ప్రధాని మోదీ ఈ విధానాన్ని అమలు చేస్తారా?

నా రెండో సూచన... భాజపా ప్రతి పాదిస్తున్న జనాభా దామాషా పద్ధతిలో పునర్విభజన చేపడితే మనల్ని ఉత్తరాది వారు ద్వితీయ శ్రేణి పౌరుల స్థాయికి తగ్గిస్తారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనతో ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు దేశంపై ఆధిపత్యం చెలాయిస్తాయని ఇక్కడున్న ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు. మనం దీనికి అంగీకరించకూడదు. నా మూడో సూచన... నిష్పత్తి (ప్రొరేటా) విధానాన్ని సైతం అంగీకరించలేం. దీనితోనూ దక్షిణాదికి నష్టమే కలుగుతుంది. ఈ పద్ధతిని పాటిస్తే సీట్ల మధ్య తేడా కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటును నిర్ణయిస్తుంది. ఒక్క సీటు కూడా భారీ తేడాను చూపుతుంది. ఒక్క సీటుతో కేంద్ర ప్రభుత్వం పడిపోయిన చరిత్ర మనదేశంలో ఉంది. అందుకే వాజ్‌పేయీ పాటించిన విధానాన్నే ప్రధాని మోదీ అనుసరించాలి'' అని రేవంత్ పేర్కొన్నారు.

# కాంగ్రెస్, భాజపాలతో అణా పైసా పనికాలేదు

(మొదటిపేజీ తరువాయి)

ఇప్పటికైనా ఈ దిశగా సమాజం ఆలోచన చేయాలి'' అని తెలిపారు. తెలంగాణకు ప్రధాన శత్రువు కాంగ్రెస్సే అని కేసీఆర్ పునరుద్ఘాటించారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో..రామగుండం నుంచి ఎర్రవల్లి దాకా 180 కిలోమీటర్ల పాదయాత్ర వారంపాటు సాగి శనివారం ముగిసింది. కేసీఆర్ అధ్యక్షతన ఎర్రవల్లిలో జరిగిన ముగింపు సభలో గులాబీ అధినేత కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చేస్తుంటే.. కేసీఆర్ అన్నా ఎక్కడున్నావు రావే.. అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానీ నన్ను ఓడించి ఇంట్లో కూర్చోబెట్టారు కదా! నేను ఎక్కడికి రావాలి? కత్తి ఒకరికిచ్చి.. యుద్ధం ఇంకొకరిని చేయమంటే ఎట్లా? భారాస హయాంలో పదేళ్లపాటు ప్రశాంతంగా బతికామని.. సమాజం భావిస్తోంది. ఇప్పుడు మళ్లీ పాదయాత్రలు, ధర్నాలు, కొట్లాటలు మొదలయ్యాయి. పాదయాత్రలు కాదు.. మనసు పెట్టి యాత్రలు చేయాలి. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని పాడు చేసుకునేలా కాకుండా.. మరింత బాగు చేసుకునే దిశగా యువత ఆలోచన చేయాలి'' అని ఉద్బోధించారు.

**రైతు సంక్షేమాన్ని ఆకాంక్షించింది భారాస ప్రభుత్వమే**

''తెలంగాణలో మొదటి నుంచీ నీటి సమస్యను ఆర్థిక సమస్యగా చూడటం ఉమ్మడి రాష్ట్ర పాలకులు ఒక అవలక్షణంగా మార్చుకున్నారు. కానీ తెలంగాణ రాగానే.. నాటి భారాస ప్రభుత్వం వ్యవసాయ స్థిరీకరణపై దృష్టి సారించింది. రైతు సంక్షేమాన్ని ఆకాంక్షించి, ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించింది. పంటకు పెట్టుబడి సాయం చేసింది. ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే.. కరెంటు పోయింది. తాగునీరు ఇవ్వలేకపోతోంది.. చెరువులు ఎండిపోయాయి. ఎందుకీ పరిస్థితి వచ్చిందో ప్రజలు అర్థం చేసుకోవాలి. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను మొదటి నుంచీ కనీస స్థాయిలో ప్రతిఘటించలేని నాటి నాయకత్వం.. ఇక్కడి ప్రజలకు ఎంతో నష్టం చేసిందనే ఆవేదనతో ఉద్యమకాలంలో నేను వాళ్లను తెలంగాణ సమాజం తరఫున కొన్ని మాటలు అన్నానే తప్ప.. నాకు వ్యక్తిగతంగా ఎవరి మీదైనా కోపం ఎందుకుంటుంది? రాష్ట్రంలో సంపద మీద కొందరు కన్నేసి ఉన్నారు. తెలంగాణలో మళ్లీ చంద్రబాబు, ఎన్డీయే కూటమి రావాలని కొందరు ప్రచారం చేస్తున్నారు. వీరిపట్ల యువత అప్రమత్తంగా ఉండాలి. ఒక పొరపాటు జరిగితే జీవితకాలం బాధపడాల్సి వస్తుంది'' అని కేసీఆర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కొప్పుల ఈశ్వర్, వంటేరు ప్రతాపరెడ్డి, జీవన్‌రెడ్డి, పుట్ట మధూకర్, భారాస కార్యకర్తలు పాల్గొన్నారు.

# మళ్లీ గ్రామాలకు రెవెన్యూ ఉద్యోగులు

(మొదటిపేజీ తరువాయి)

లను ప్రభుత్వం జీపీవోలకు అప్పగించనుంది. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేసేలా ఈ పోస్టులను ఏర్పాటు చేస్తోంది.

**పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోలకు ఐచ్ఛికం**

గతంలో రెవెన్యూశాఖలో గ్రామ రెవెన్యూ సహాయకులు, అధికారులు (వీఆర్‌ఏ, వీఆర్వో)గా పనిచేసిన వారికి జీపీవో పోస్టుల భర్తీలో ఐచ్ఛికాల ద్వారా అవకాశం ఇవ్వనున్నారు. గత ప్రభుత్వం 2020లో వీఆర్వో, 2022లో వీఆర్‌ఏ వ్యవస్థలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఆ ఉద్యోగులను ఇతర ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లకు బదలాయించారు. ప్రస్తుతం జీపీవోలుగా సేవలు అందించాలంటే రెవెన్యూ పాలనపై పట్టున్న వీఆర్‌ఏ, వీఆర్వోలు మేలని ప్రభుత్వం భావిస్తోంది. రెవెన్యూ సంఘాలు కూడా వారిని తిరిగి రెవెన్యూశాఖలోకి తీసుకోవాలని ఎప్పటి నుంచో డిమాండు చేస్తున్నాయి. ఈ పోస్టుల్లో కొత్త వారిని భర్తీ చేయడం వల్ల ఖజానాపై భారం పడే అవకాశాలు లేకపోలేదు. ఈ కారణంతోనూ ప్రభుత్వం పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోల వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. మూడు నెలల క్రితమే పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోల్లో జీపీవో పోస్టులపై ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది.

**ఖాళీ పోస్టుల భర్తీపై..**

వీఆర్వో పోస్టుల రద్దుకు ముందు రాష్ట్రంలో 7,039 పోస్టులు ఉండగా.. 5,195 మంది విధులు నిర్వర్తించేవారు. వీఆర్‌ఏల రద్దుకు మునుపు 25,750 పోస్టులు ఉండగా 20,255 మంది విధుల్లో ఉండేవారు. వీరిలో 2,500 మంది డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా వచ్చినవారు కాగా 61 ఏళ్లు నిండిన వారు 3,767 మంది ఉండేవారు. వీరు మినహా మిగిలిన వారిని వివిధ ప్రభుత్వ శాఖలకు బదలాయించారు. ప్రస్తుతం వెయ్యి మంది సర్వేయర్లు, 10,954 మంది జీపీవోల నియామకానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆసక్తి ఉన్న పూర్వ వీఆర్‌ఏ, వీఆర్వోల నుంచి దరఖాస్తులు కోరగా 9,654 మంది దరఖాస్తు చేశారు. వారిలో ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు ఉన్నవారు 6 వేల మంది వరకు ఉన్నట్లు గుర్తించారు. అయితే, ఎలాంటి షరతులు, రాత పరీక్ష లేకుండా తీసుకోవాలని రెవెన్యూ సంఘాలు డిమాండు చేస్తున్నాయి. కొత్త పోస్టులను సృష్టించి భర్తీ చేస్తున్న నేపథ్యంలో పూర్వ ఉద్యోగులకు నేరుగా అవకాశం కల్పిస్తే న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉంది. దీంతో రాత పరీక్ష ద్వారా అవకాశం కల్పించాలని భావిస్తున్నారు. ఎంపికలు పోను మిగిలిన పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

**మంత్రి పొంగులేటికి కృతజ్ఞతలు**

జీపీవో పోస్టుల మంజూరు పట్ల రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రెవెన్యూ ఉద్యోగుల ఐకాస నేతృత్వంలో నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఐకాస ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో పలు సంఘాలు హైదరాబాద్‌లో ఆయన్ను కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తుండటం పట్ల సీఎంకు, మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహసీల్దార్ల సంఘం, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. షరతులు లేకుండా రెవెన్యూ పాలనపై అనుభవం ఉన్న వారందరినీ తిరిగి తీసుకోవాలని తెలంగాణ వీఆర్వోల ఐకాస అధ్యక్షుడు గోల్కొండ సతీష్ తదితరులు డిమాండు చేశారు.

# తాత్కాలిక వలసదారులపై ట్రంప్ కొరడా

(మొదటిపేజీ తరువాయి)



చేస్తున్నట్లు హోమ్‌లాండ్ సెక్యూరిటీ విభాగం వెల్లడించింది. నెల రోజుల్లో వారిని దేశం నుంచి బహిష్కరించనున్నట్లు తెలిపింది. మానవతా పెరోల్ కార్యక్రమం కింద 2022 అక్టోబరు తర్వాత ఆ నాలుగు దేశాల నుంచి అమెరికాకు వలస వచ్చిన వారికి ఈ ఉత్తర్వులు వర్తించనున్నాయి. వీరంతా ఇతరుల ఆర్థిక సహకారంతో అమెరికాకు వచ్చారని, రెండేళ్ల పాటు యూఎస్‌లో నివసించడానికి, పని చేయడానికి తాత్కాలిక అనుమతులు పొందారని హోమ్‌లాండ్ సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోయెమ్ వెల్లడించారు. వీరు ఏప్రిల్ 24న లేదా ఫెడరల్ రిజిస్టర్‌లో నోటీసులు ప్రచురించిన 30 రోజుల తర్వాత అగ్రరాజ్యంలో ఉండేందుకు లభించిన చట్టపరమైన రక్షణను కోల్పోనున్నారని తెలిపారు.

**ఒక్క రోజే 1000 గోల్డ్ కార్డుల అమ్మకం**

ఇంటర్నెట్ డెస్క్: డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన గోల్డ్ కార్డుకు భారీ స్పందన లభించింది. ఒక్క రోజే 1000 కార్డులను విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5 బిలియన్ డాలర్లు సేకరించామని తెలిపారు. లక్షల మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఏప్రిల్ 28న కెనడాలో ఎన్నికలు..!




కెనడా ప్రధానమంత్రిగా మార్క్ కార్నీ ఇటీవల ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన ముందస్తు ఎన్నికలకు సిద్ధమైనట్లు సమాచారం. ఏప్రిల్ 28న ఫెడరల్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. కెనడా పార్లమెంటులో మొత్తం 338 స్థానాలున్నాయి. వీటికి ఏప్రిల్ 28న ఎన్నికలు నిర్వహించనున్నట్లు కార్నీ ఆదివారం ప్రకటించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు తెలిపాయి. ప్రధాని కార్నీ కెనడా రాజధాని ఒట్టావా నుంచి బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. లిబరల్ పార్టీ శనివారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. జనవరిలో జస్టిన్ ట్రూడో ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో లిబరల్ పార్టీ సభ్యులు తదుపరి ప్రధానిగా కార్నీని ఎన్నుకున్నారు. కొత్త నాయకత్వం ఏర్పడిన తర్వాత గ్లోబల్ న్యూస్ నిర్వహించిన పోల్ సర్వేల్లో ఓటర్లు అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్లు వెల్లడైంది. 42 శాతం మంది ఓటర్లు లిబరల్ పార్టీకి మద్దతివ్వగా.. 36 శాతం మంది కన్జర్వేటర్లకు అనుకూలంగా ఉన్నారు. ఇక 48 శాతం మంది మార్క్ కార్నీ నాయకత్వాన్ని ఆమోదించగా.. 30 శాతం మంది వ్యతిరేకిస్తున్నారట. ఇదిలాఉండగా.. అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వాములైన కెనడా, మెక్సికో (Mexico) నుంచి వచ్చే దిగుమతులపై మార్చి 4 నుంచి 25శాతం సుంకాలు వసూలు చేస్తున్న సంగతి తెలిసిందే. వలసలు, డ్రగ్స్ అక్రమ రవాణాను సరిహద్దుల్లోనే కట్టడి చేయడంలో విఫలమైతే కెనడా యూఎస్‌లో 51వ రాష్ట్రంగా చేరాలని ట్రంప్ చురకలంటించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో ఆ దేశంలో జరగనున్న ఎన్నికలు కీలకంగా మారాయి.

# నీటి నిల్వతో భవితకు బంగారు బాట

(మొదటిపేజీ తరువాయి)

1.55 లక్షల పంట కుంటలు తవ్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచి కూడా చిన్నచిన్న నీటి తటాకాలు తవ్వే సంప్రదాయం ఉందని గుర్తుచేశారు. ఆయన హయాంలో మాదిరిగానే రాయలసీమ.. మళ్లీ రతనాల సీమగా మారాలని ఆకాంక్షించారు. ప్రతి రైతు తన పొలానికి అనుబంధంగా పంట కుంటను అభివృద్ధి చేసుకుంటే సాగు నీటితోపాటు అందులో చేపలు, బాతులు పెంచడం, కుంట చుట్టూ మొక్కలు నాటి వాటి నుంచి సైతం కొంత ఆదాయం సమకూర్చుకోవచ్చని పవన్ కల్యాణ్ చెప్పారు. మే నెలాఖరుకల్లా పంట కుంటల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

**ఉపాధి పనులతో అన్నదాతలకు చేయూత**

ఉపాధి హామీ పనులతో అన్నదాతల జీవితాల్లో వెలుగు నిండాలన్నదే కూటమి ప్రభుత్వ ఆశయమని చెప్పారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద 97.44 లక్షల మంది కూలీలకు వారి స్వగ్రామాల్లోనే ఉపాధి చూపగలుగుతున్నామని పేర్కొన్నారు. కష్టపడే ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకంలో పని లభిస్తుందని.. నాకైనా పని దొరక్కపోతే ఉపాధి కూలీగా మారేందుకు సిద్ధంగా ఉన్నానని వ్యాఖ్యానించారు. 'గతంలో ప్రపంచ రికార్డు సృష్టించేలా ఒకే రోజు 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాం. అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి ఉండటంతో పల్లె పండగ విజయవంతమైంది. ఉపాధి హామీ బకాయిలు రెండు రోజుల్లో జమయ్యేలా చూస్తాం' అని చెప్పారు. గత ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రాజకీయ ఉపాధి పథకంగా మార్చిందని విమర్శించారు. లబ్ధిదారులు ఎవరో కూడా తెలియకుండా పనులు చేసిందని మండిపడ్డారు.

**8 నెలల్లోనే 4 వేల కి.మీ. రోడ్లు నిర్మించాం**

వైకాపా ఐదేళ్ల పాలనలో 4,276 కి.మీ. మేర రహదారులు నిర్మిస్తే.. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కేవలం 8 నెలల్లోనే 4 వేల కి.మీ.ల మేర రహదారులను నిర్మించిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఉపాధి హామీ పథకం కింద ఇప్పటివరకు రూ.9,597 కోట్లు వెచ్చించామన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో జన్‌మన్ పథకం కింద ఆదివాసీ గ్రామాలకు రహదారులు నిర్మించడంతోపాటు ఇతర మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు.

**'కొణిదెల'కు సొంత ట్రస్టు నిధులు**

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని కొణిదెల గ్రామాన్ని సొంత ట్రస్టు నుంచి రూ.50 లక్షలు వెచ్చించి అభివృద్ధి చేయనున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఆ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గతంలో ప్రకటించానని, త్వరలోనే ఆ ఊరిని సందర్శిస్తానని చెప్పారు. అన్ని జిల్లాల్లో పర్యటించాలని భావిస్తున్నామని.. గ్రామాలకు వెళ్లినప్పుడు రెండు రోజులు ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని పేర్కొన్నారు.

# బెయిల్‌పై పోసాని విడుదల

(మొదటిపేజీ తరువాయి)

శనివారం ఉదయం ఆయన విడుదల కావాల్సి ఉన్నా సకాలంలో జామీను ఇవ్వకపోవడంతో ఆలస్యమైంది. రూ.2 లక్షల విలువతో ఇద్దరు వ్యక్తులు జామీను ఇవ్వడంతో సాయంత్రం జైలు నుంచి విడుదలయ్యారు. ఆయన్ని మాజీ మంత్రి అంబటి రాంబాబు, వైకాపా నాయకులు పరామర్శించారు.

# కాలిన నోట్లకట్టల ప్రస్తావన?

(మొదటిపేజీ తరువాయి)

వివరాలూ ఫొటోలు, వీడియోల్లో ఉన్నాయి. సీజేఐ రాసిన లేఖ కూడా ఉంది. దిల్లీ హైకోర్టు సీజే సమర్పించిన నివేదికను పరిశీలిస్తే.. సగం కాలిన నోట్ల కట్టలను గురించి అధికారిక ప్రస్తావన కనిపించింది. దీనిపై అధికారిక సమాచారం ఉందన్న విషయం అందులో ఉంది. మరోవైపు స్టోర్ రూంలో తానుగానీ, తన కుటుంబ సభ్యులుగానీ ఎటువంటి నగదును ఉంచలేదని సీజే జస్టిస్ ఉపాధ్యాయకు ఇచ్చిన వివరణలో జస్టిస్ యశ్వంత్ వర్మ పేర్కొన్నారు. తమకు చెందిన నగదు దొరికిందన్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. ప్రాథమిక ఆధారాల ప్రకారం.. ఈ అంశంపై మరింత లోతుగా విచారణ జరగాల్సి ఉందని జస్టిస్ డి.కె.ఉపాధ్యాయ అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని ఆయన శుక్రవారం తెలిపినా శనివారం బయటకు వచ్చింది.

**విచారణకు త్రిసభ్య సంఘం**

దిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంపై విచారణ జరపాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నిర్ణయించారు. ఇందు కోసం 3 రాష్ట్రాల హైకోర్టుల న్యాయమూర్తులతో త్రిసభ్య సంఘాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో పంజాబ్‌హరియాణా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.ఎస్.సంధావాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అను శివరామన్ సభ్యులుగా ఉంటారు. ప్రస్తుతానికి జస్టిస్ యశ్వంత్ వర్మకు కేసుల విచారణ పరంగా ఎలాంటి బాధ్యతలూ అప్పగించవద్దని దిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.కె.ఉపాధ్యాయను సీజేఐ ఆదేశించారు.



## అంగన్వాడి కేంద్రాన్ని
# ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

- గర్భిణీలు బాలింతలతో మాట్లాడి పోషకాహారం అందుతున్న తీరును తెలుసుకున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు.

సంగారెడ్డి మార్చి22 (సమయం న్యూస్): జిల్లాలోని కొండాపూర్ మండలం, మల్కాపూర్ లోని అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని , ప్రతిభ ను పరిశీలించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం కోసం అంగన్వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణీ స్త్రీలు బాలింతలతో మాట్లాడి అంగన్వాడీ కేంద్రం ద్వారా వారికి అందుతున్న సేవలను గురించి వివరాలను వారితో మాట్లాడి తెలుసు కున్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సమయానికి టీకాలు తీసుకోవాలని ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను వైద్యుల సూచన మేరకు వాడాలని సందర్భంగా మహిళలకు సూచించారు. అంగన్వాడి కేంద్రాల ప్రకారం మహిళలకు పోషకాహారం అందించడం కోసం అభివృద్ధి కోసం అందిస్తున్న సేవలు వివరాలను కలెక్టర్ ఈ సందర్భంగా వారికి వివరించారు. అంగన్వాడి ద్వారా అందించిన సేవ లను ప్రతి వినియోగించుకోవాలని ఈ సందర్భంగా వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, తహసిల్దార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బంజారాహిల్స్ లో రూ. 1.71 కోట్ల అభివృద్ధి పనులకు
# శంకుస్థాపన చేసిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

* మురుగు నీటి పరిష్కారానికి కృషి

హైదరాబాద్, మార్చి 22, సమయం న్యూస్: నగర అభివృద్ధి పై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తుందని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం బంజారాహిల్స్ డివిజన్ ఎమ్మెల్యే కాలనీలో రూ. 1.71 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఫ్లాట్ నెం. 160/ఎ నుండి ఒమెగా హాస్పిటల్ వరకు రూ. 1.21 కోట్ల వ్యయంతో మురుగు నీటి పైప్ లైన్ ను పున:నిర్మాణం, రూ. 22 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ గల జీహెచ్ఎంసీ పార్కు నుండి ఎమ్మెల్యే కాలనీ రోడ్ 12 వరకు మురుగు నీటి లీకేజీ, ఓవర్ ఫ్లో నివారణకు ప్రధాన సీవరేజ్ పైప్ లైన్ ఏర్పాటుకు, రూ.





28 లక్షల వ్యయంతో ఎమ్మెల్యే కాలనీ ఫ్లాట్ నెం 11 బి నుండి 2బి వరకు మురుగు నీరు నిల్వకుండా సీవరేజ్ స్థానంలో 300 ఎం.ఎం ఆర్.సి.సి ఎన్.పి.ఎస్ శివరేజ్ లైన్ వేయుటకు మేయర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... మురునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. మురునీటి నిల్వలు, ఓవర్ ఫ్లో, లీకేజీల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన మురుగునీటి వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ జీ.ఎం హరిశంకర్, మేనేజర్ రాంబాబు, జీహెచ్ఎంసీ ఈఈ విజయ్ కుమార్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజోపయోగ మైన నిర్ణయాలు తీసుకుని
# నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దాం

: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

* జీహెచ్ఎంసీకి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు

* స్టాండింగ్ కమిటీకి నూతనంగా ఎన్నికైన సభ్యులను సన్మానించిన మేయర్, కమిషనర్

* స్టాండింగ్ కమిటీలో 8 అంశాలకు కమిటీ ఆమోదం




హైదరాబాద్, మార్చి 22: ప్రజోపయోగ మైన నిర్ణయాలు తీసుకుని నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దామని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్టాండింగ్ కమిటీ సభ్యులను కోరారు. శనివారం సాయంత్రం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన స్టాండింగ్ కమిటి సభ్యులకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి అభినందనలు తెలుపుతూ సభ్యులందరిని శాలువలతో సన్మానించారు. అనంతరం అధికారులు, స్టాండింగ్ కమిటీ సభ్యుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... స్టాండింగ్ కమిటికి అత్యంత ప్రాముఖ్యత ఉందన్నారు. స్టాండింగ్ కమిటీ పాలసీ నిర్ణయాల కమిటీ అని, నిర్మాణాత్మక, ప్రజోపయోగ మైన నిర్ణయాలు తీసుకుని నగర అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో కమిటీ సమావేశాలను నిర్వహించుకుని అన్ని అంశాలను సమగ్రంగా చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని అన్నారు. స్టాండింగ్ కమిటీ నిబంధనల గురించి సభ్యులకు వివరించారు. గతంలో ఎప్పుడు లేని విధంగా రాష్ట ప్రభుత్వం జిహెచ్ఎంసి కి పెద్దయెత్తున నిధులను మంజూరు చేస్తున్నది. హైదరాబాద్ ను గ్లోబల్ సిటీ గా అభివృద్ధి చేయుటకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందుకు రాష్ట ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారికి జిహెచ్ఎంసి తరుపున మేయర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, సమీనా బేగం, అబ్దుల్ వాహెబ్, మహాలక్ష్మి రమన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సి.ఎన్. రెడ్డి, వి.జగదీశ్వర్ గౌడ్, బురుగడ్డ పుష్ప నగేష్ పాల్గొన్నారు. అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, వేణుగోపాల్, పంకజ, గీతా రాధిక, రఘుప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, సుభద్ర దేవి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, ఉపేందర్ రెడ్డి, వెంకన్న, సిసిపి శ్రీనివాస్, సి.ఇ రత్నాకర్, చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

*** స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు:**

1. స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక పూర్తి అయినందున ప్రతి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించడానికి కమిటీ ఆమోదం.

2. అల్వాల్ గ్రామానికి చెందిన గ్రామ కంఠం లోని 0.11 గుంటల భూమిని మేడ్చల్ డివిజన్ లో కొత్త అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అగ్నిమాపక శాఖ అధికారికి కేటాయించుటకు కార్పొరేషన్ ఎన్.ఓ.సి జారీచేయుటకు కమిటీ ఆమోదం.

3. జీహెచ్ఎంసీ జనవరి నెల యొక్క ఆదాయ వ్యయాల వివరాలు కమిటీకి సమాచారం నిమిత్తం సమర్పించడం జరిగింది.

4. 202425 ఆర్థిక సంవత్సరానికి వన్ టైమ్ స్కీమ్ కింద 90% బకాయి వడ్డీని మాఫీ చేయడం, స్టాండింగ్ కమిటీ ఆమోదంతో అనుమతి కోరుతూ ప్రభుత్వానికి సిఫారసు చేస్తూ కమిటీ ఆమోదం.

5. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కింద గుడిమల్కాపూర్ ఫ్లవర్ మార్కెట్ లో ఉన్న కుమందన్ బౌలి హెరిటేజ్ స్ట్రక్చర్ (చారిత్రక మెట్ల బావి) పరిరక్షణ, అభివృద్ధి కి గాను ఇండియన్ స్కూల్ ఆఫ్ హైదరాబాద్ యొక్క ఆర్థిక సహకారంతో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో పునరుద్ధరణ, పరిరక్షణ కోసం మొదటి దశలో 18 నెలల పాటు నిర్మాణ్ ఎన్‌జిఓ ఆర్గనైజేషన్ తో ఖైతరాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం.

6. చాంద్రాయణ గుట్ట బండ్లగూడ లో గల ప్రోగ్రెస్ స్కూల్ నుండి క్రిస్టల్ టౌన్, డెలివరీ కొరియర్ సర్వీస్ వరకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్, VDCC రోడ్ నిర్మాణాలకు రూ. 2.95 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు పరిపాలన అనుమతికి కమిటీ ఆమోదం.

7. శేరిలింగంపల్లి మండలం, లింగంపల్లి గ్రామంలో నల్లగండ్ల చెరువు వద్ద మురుగు మళ్లింపునకు రూ. 3.35 కోట్ల తో చేపట్టేందుకు టెండర్ పిలువడానికి అడ్మినిస్ట్రేటివ్ మంజూరు కు కమిటీ ఆమోదం.

8. శేరిలింగంపల్లి జోన్ కొండాపూర్ గ్రామంలో గల కుడి కుంట ను సి.ఎస్.ఆర్ కింద పునరుద్ధరణకు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో మెస్సర్స్ సాహీ ఎన్.జి.ఓ తో ఆరు నెలల కాలానికి అడిషనల్ కమిషనర్ లేక్స్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం.



## ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించిన వారికి
## వెంటనే ప్రొసీడింగ్ లు ఇవ్వాలి

* జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు.

* జిల్లాలోని రెవిన్యూ,మున్సిపల్ పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్.

సంగారెడ్డి మార్చి22 (సమయం న్యూస్) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎల్ఆర్ఎస్ రుసుము రాయితీ పథకం కింద డబ్బులు చెల్లించిన వారికి వెంటనే ప్రొసీడింగులు అందజేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు జిల్లాలోని రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు ఎంపీడీవోలు ఎంపీలు పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు ఎల్ఆర్ఎస్ కు రుసుము చెల్లించిన దరఖాసుదారులకు వెంటనే ప్రొసీడింగ్లు అందజేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు ప్రభుత్వం ఈ నెల 31 వరకు అవకాశం కల్పించిన 25% రాయితీపై అవగాహన కల్పించి 100% దరఖాసుదారులు ఎల్ఆర్ఎస్ రుసుము చెల్లించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు ఇందుకోసం వివిధ ప్రచారం మాధ్యమాలను విరివిగా వినియోగించుకోవాలని ఆటోల ద్వారా, మైక్ ల ద్వారా ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ కమిషనర్లు ఎంపీ ఓ లు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మున్సిపల్ బిల్ కలెక్టర్లు రెవిన్యూ ఇన్స్పెక్టర్లతో ప్రతిరోజు సమీక్ష నిర్వహించి రోజు వారు టార్గెట్లను నిర్ణీత గడువులోగా చేరుకునేలా చర్యలు చేపట్టాలని రోజువారి పురోగతిని జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు వెంటవెంటనే తెలియజేయాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్పీ తో కలిసి హాలియా లో 10 వ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

నల్గొండ మార్చి22( సమయం న్యూస్) : పదో తరగతి పరీక్షల లో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ హాలియ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తో కలిసి తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలు, శనివారం పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు అన్నింటిని ఎంఈఓ , చీఫ్ సూపరింటిండెంట్ ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ స్థానిక పోలీసులతో మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద భద్రతను పకడ్బందీగా నిర్వహించాలని, ఎట్టి పరిస్థితులలో ఇతరులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించవద్దని, పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు అనుమతి లేదని చెప్పారు.పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ కేంద్రాలు మూసి ఉంచాలని,పోలీస్ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పరీక్షలు సవ్యంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిరియాల



గూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మిర్యాలగూడ డి ఎస్ పి తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.

## సంపాదకీయం

# ఇంధన విధానంపై సమీక్షించాలి !

కరోనా తరవాత సొంత వాహనాల వాడుకం పెరిగింది. బ్యాంకులు సులువుగా రుణాలు ఇవ్వడంతో పాటు, వాహనం అన్నది వ్యక్తిగత అవసరంగా మారడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరూ టూవీలర్, ఫోర్ వీలర్లను కొనుగోలు చేస్తున్నారు. ఉన్నంతలో తమ ఖర్చులను తగ్గించి ఇందుకు సాహిస్తున్నారు. ఈ క్రమంలో మధ్యతరగతి వారిపై వాహన, పెట్రో,డీజిల్ ఖర్చులు అదనం అవుతున్నాయి. అదే క్రమంలో రిజిస్ట్రేషన్ ధరలు ఇతరత్రా ఖర్చులు పెరుగుతున్నాయి. నిజానికి ప్రభుత్వం సొంతంగా ఇళ్లు కొనుక్కోవాలనుకునే వారికి, కట్టుకునే వారికి అనుగుణంగా రుణాలు ఇచ్చేలా నిబంధనలు సడలించాలి. వాహనాలు, ఇంటి రుణాలపై వడ్డీలు, రిజిస్ట్రేషన్లు తగ్గించాలి. ఇది ఓరకంగా ప్రోత్సాహకరంగానూ ఉంటుంది. వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. అలాగే పెట్రో,డీజిల్ ధరలు కూఆ అందుబాటులోకి రావాలి. పెట్రో ధరలకే ఇవి వాహనాలు అందుబాటులోకి వస్ఆయిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు కొంత ఉత్సాహాన్ని ఇచ్చేదే. అయితే దేశీయంగా ఇందన రంగాన్ని ప్రోత్సహించాల్సి ఉంది. సోలార్ పవర్ పెద్ద ఎత్తున అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి. దీంతో విద్యుత్ ఖర్చులు, ఇంధన ఖర్చులు తగ్గుతాయి. బయోడీజిల్ ఉత్పత్తికి అవసరమైన కానుగ చెట్ల పెంపకం అంటూ దివంతగ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎంగా ఉన్న సమయంలో హడావిడి జరిగింది. కానుగ చెట్ల పెంపకానికి ప్రోత్సాహకాలు ఇచ్చారు. అయితే ఆ తరవాత ఏమయ్యిందో ఏమో గానీ దీని ఊసేలేకుండా పోయింది. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల గురించి పరిశోధనలు ఏ మేరకు జరుగుతున్నాయో కానీ.. ఇంధన వనరుల కోసం మనం విదేశాలపై ఆధారపడుతున్నాం. లాటిన్ అమెరికా దేశం భారీ పరిమాణంలో చెరకు దిగుబడులను సాధిస్తోంది. ఆ చెరుకు నుంచి నేరుగా బయోడీజిల్‌ను ఉత్పత్తి చేస్తోంది. నేల, నీరు అపారంగా ఉన్న కారణంగా, ఆహార భద్రతపై ఎటువంటి ప్రభావం లేకుండా ఆ సహజ వనరులలో గణనీయమైన భాగాన్ని బయోడీజిల్ ఉత్పత్తికి వినియోగించుకునే వెసులుబాటును పరిశీలించాలి. ఆహారోత్పత్తికి భంగం వాటిల్ల కుండా.. బయోడీజిల్ ఉత్పత్తికి నిరుపయెగంగా ఉన్న భూముల ను వినియోగిస్తే ఫలితం ఉంటంది. బయోడీజిల్ ఉత్పత్తికి చెరుకును మరింతగా ఉత్పత్తి చేయడం వల్ల అధికాదాయం లభిస్తుంది.ఇకపోతే చక్కెర ఉత్పత్తికి వినియోగించుకున్న అనంతరం మిగిలే చెరుకు పిప్పిని విద్యుదుత్పత్తికి వినియోగించు కోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వరి, గోధుమ పంటల సాగుతో కూడా మనకు ఎండుగడ్డి అపారంగా సమకూరుతుంది. దానిని పశుగ్రాసంగా మాత్రమే కాకుండా విద్యుదుత్పత్తికి కూడా బాగా వినియోగించు కోవచ్చు. అలాగే కాగితాల తయారీ మొదలైన ఇతర ప్రయోజ నాలు కూడా ఎండుగడ్డితో సమకూరుతాయి. కనుక వివిధ ఉపయోగాలు ఉన్న కారణంగా ఎండుగడ్డిని ఉత్పత్తి చేసుకోవడమే మనకు అనేక విధాలుగా లాభకరమైన వ్యవహారం. ప్రస్తుత ఇంధన సంక్షోభ సమయంలో మనం పలురకాల ప్రత్యమ్నాయాలను ఆలోచనచేయాలి. సమస్యను అధిగమించేందుకు ఇంధన వినియోగాన్ని మరింతగా తగ్గించే విషయమై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. సంపన్నులు, సామాన్యులను అందుకు అనుగుణంగా ప్రోత్సహించాలి. దీంతో పర్యావరణం కూడా పరిరక్షించుకోగలం. మన అవసరాల మేరకు...మనకున్న భూమిని,నీటిని ఉపయోగించు కుని ఉత్పత్తులు పెంచుకోకుంటే భవిష్యత్‌లో ఇంతకన్నా దుర్భర పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావచ్చు. బయోడీజిల్ ఉత్పత్తికి భారీ పరిమాణంలో నీరు అవసర మవుతుందన్న వాదనా ఉంది. ఒక హెక్టారు భూమిలో చెరకుసాగుకు, గోధుమసాగు కంటే 20రెట్లు అధికంగా నీరు అవసరమవుతుంది. మరి మన జలవనరులు ఇప్పటికే బాగా తగ్గిపోతున్నాయి. ముఖ్యంగా దేశవ్యాప్తంగా భూగర్భ జలాలు ఏయేటి కాయేడు తగ్గిపోతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో చెరుకు సాగుకు మరింతగా భూగర్భ జలాలలను వాడు కుంటే భూగర్భ జలమట్టం మరింతగా పడిపోతుందన్న వాదనా ఉంది. ఈ పరిస్థితి తప్పకుండా మన ఆహార భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని కొందరు హెచ్చరిస్తున్నారు. జీవ ఇంధనాలను ప్రోత్సహించడం అవసరమన్న ఆలోచనచేయడం లేదు. ఇక తాజా పరిస్థితులను పరిశీలిస్తే ఉక్రెయిన్‌లో యుద్ధం ఇంధన చమురు ధర పెరుగుదలకు దారితీసింది. యుద్ధం కొనసాగిన పక్షంలో చమురు ధరలు మరింతగా పెరిగే ప్రమాదం ఎంతైనా ఉంది. తాజాగా పెరిగిన ధరల తీరు చూస్తుంటే ఈ ధరల మోత ఇక ముందు కూడా ఆగదని స్పష్టం అవుతోంది. ప్రత్యామ్నాయ మార్గాలలో ఇంధన భద్రతను సమకూర్చుకోవల్సిన అగత్యాన్ని హెచ్చరిస్తోంది. ఈ పరిణామాల క్రమంలో దేశంలోని పాలకులు ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాలి. మూడు ప్రధాన ఇంధన వనరులు చమురు, బొగ్గు, యురేనియం దిగుమతులపై మన ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. జీవ ఇంధనాలను ప్రోత్సహించడం ఒక ప్రత్యామ్నాయ మార్గమని పలువురు సూచిస్తున్నారు. చెరుకు నుంచి, సారహీన నేలల్లో పెరిగే జట్రోఫా మొక్కల విత్తనాల నుంచి జీవ ఇంధనాలను ఉత్పత్తి చేసుకోవచ్చని కూడా అంటున్నారు. సారహీన అంటే చౌడు నేలలను ఉపయోగించు కోవడం ద్వారా జీవ ఇంధనాల ఉత్పత్తిని ఇతోధికంగా పెంచుకోవడం సాధ్యమవుతుంది. అలాగే సోలార్ పవర్‌పై మరింత విస్తృతంగా పరిశోధనలు జరగగాలి. విద్యుత్ ఉత్పత్తిని పెంచుకుని, వాహనాలకు విద్యుత్ వాడకాన్ని ఉపయోగించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. దేశ శ్రేయస్సు దృష్ట్యా మాత్రమే బయోడీజిల్ మొదలైన జీవ ఇంధనాలను ప్రోత్సహించాలి. అందుకు అవసరమైన పరిశోధనలు జరగాలి. దీని ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలి.

# పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహన రావాలి

* హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



హనుమకొండ మార్చి 22(సమయం న్యూస్) : పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ప్రజల్లో మరింత అవగాహన రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. శనివారం సాయంత్రం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ లోని పద్మశ్రీ డాక్టర్ నేరెళ్ళ వేణుమాధవ్ కళా ప్రాంగణం లో డబ్ల్యూడబ్ల్యూఎఫ్, ప్రజ్వల్ సంస్థల ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం 2008 నుంచిప్రపంచవ్యాప్తంగా ఎర్త్ అవర్ కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాలో అనేక పర్యావరణహిత కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అవసరమైన మేరకే విద్యుత్ లైట్లు,ఇతరత్రా అవసరాలకు విద్యుత్తు ను వినియోగించుకోవాలని, అనవసరమైన విద్యుత్ వినియోగాన్ని తగ్గించుకున్నట్లయితే పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని అన్నారు. సోలార్ పవర్ వినియోగం, పునరు పునరు జ్జీవ వనరుల వినియోగంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీలలో తడి, పొడి చెత్తను వేరు చేయడంపై ప్రజల్లో అవగాహన రావాలి. తడి పొడి చెత్త వేరు చేయడం ద్వారా పునర్వినియోగం, రీసైకిల్ చేయవచ్చునని అన్నారు. దీని గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావాలన్నారు. దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు కాకుండా స్టీల్ వాటర్ బాటిళ్లను వినియోగించడం వల్ల ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకొని తద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకునేలా ప్రజల్లో చైతన్యం వచ్చినట్లయితే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. పంటల సాగులో రసాయనిక ఎరువులు కాకుండా పర్యావరణహితమైన వర్మి కంపోస్టు ఎరువులను వినియోగించేలా రైతులను ప్రోత్సహించిన ఉమ్మడి జిల్లాకు చెందిన పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ చేతులుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ డబ్ల్యూఎఫ్ సంస్థ రాష్ట్ర డైరెక్టర్ ఫరిదా మాట్లాడుతూ భూతాపం నుండి ధరిత్రిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్, మారి, ప్రజ్వల్, తదితర సంస్థల ప్రతినిధులు వంశీకృష్ణ, వరంగల్ డీసీవో సంజీవరెడ్డి, ఇతర అధికారులు, పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఎల్ ఆర్ ఎస్ సువర్ణ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోండి

: మేయర్ శ్రీమతి గుండు సుధారాణి

* పట్టణ ప్రణాళిక అధికారులతో ఎల్‌ఆర్‌ఎస్, నాలాల విస్తరణ, తదితర అంశాలపై సమీక్షించిన మేయర్



గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ మార్చి22(సమయం న్యూస్): ప్రభుత్వం కల్పించిన ప్లాట్లు లేఔట్ల క్రమబద్ధీకరణ సువర్ణ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి సూచించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణ పురోగతి, నాన్ కమర్షియల్ గా అనుమతి పొంది కమర్షియల్ గా వినియోగిస్తున్న భవనాల గుర్తింపు, నాలాల విస్తరణ, ఎన్క్రోచ్మెంట్ల తొలగింపు తదితరాంశాలపై పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 26 ఆగస్టు 2020 వరకు రిజిస్ట్రేషన్ చేసుకొని ఉన్న ప్లాట్ల, నాన్ లే అవుట్ లకు ఈనెల 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25% రాయితీకి అవకాశం కల్పించిందని, అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్లాట్ల కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా ఈ నెల 31 తేదీలోగా ఎల్‌ఆర్‌ఎస్ చేసుకుంటే 25% రాయితీ వర్తిస్తుందన్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కల్పించిన ఈ సువర్ణ అవకాశాన్ని చేసుకోవాలని ప్రజలను కోరారు. ఎల్లారీస్ కొరకు ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎల్‌ఆర్‌ఎస్ రెగ్యులరైజేషన్ కొరకు సంబంధించి ఏదైనా సలహా కోసం జిడబ్ల్యు ఎం సి వ్యాప్తంగా ఏర్పాటుచేసిన పది హెల్ప్ డెస్క్ లలో సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. కేవలం ఎనిమిది రోజులు మాత్రమే మిగిలి ఉన్నందున వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించి ప్రజల్లో చైతన్యం కల్పించాలని మేయర్ కోరారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్ ద్వారా సంప్రదించి ప్రభుత్వం ఇచిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొనేల అధికారులు కృషి చేతకాని కోరారు అందుకు అర్హులైన వారికి ఆర్పీల ద్వారా ప్రతిరోజు ఫోన్ ద్వారా గుర్తు చేస్తూ వారిలో అవగాహన కల్పించి ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకునేలా చూడాలన్నారు. క్రమబద్ధీకరించని ప్లాట్లల్లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వబోమని హెచ్చరించారు. జిడబ్ల్యూ ఎంసీ పరిధిలో లక్ష ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు రాగా 68 వేలు ఆమోదం పొంది, 3 వేల మంది ఫీజు కట్టారని, 1200 మందికి ప్లాట్ల క్రమబద్ధీకరణ ప్రొసీడింగ్లు ఇవ్వడం జరిగిందన్నారు. బల్దియా వ్యాప్తంగా గృహ వినియోగానికి అనుమతులు పొంది కమర్షియల్ గా వియోగించుకుంటున్న భవనాలను నియమించిన బృందాల ఆధ్వర్యంలో గుర్తించి వాటి పన్నును రివైజ్ చేయాలని, ఖాళీ స్థలాలపై పన్ను విధించాలని, మేయర్ ఈ సందర్భంగా అధికారులను కోరారు. వచ్చే వర్షాకాలంలో నగర ముంపు నివారణ నిమిత్తం చేపట్టే చర్యలలో భాగంగా హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో నియమించిన ఎన్ఫోర్స్మెంట్ బృందాలు ఏప్రిల్ 15వ తేదీ నుండి గ్రేటర్ వరంగల్ లోని ప్రధాన నాలాలను విస్తరణ చేయడంతో పాటు నాలాల కిరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించాలని మేయర్ ఆదేశించారు. ఈ సమావేశంలో బల్దియా సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్ ఏసీపీలు శ్రీనివాస్ రెడ్డి, ఖలీల్, నస్రీన్ బానో, ఇంచార్జి ఇర్షాద్, రజిత, టిపిఎస్ లు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి లో నీటి సరఫరా పై బల్దియా ప్రత్యేక శ్రద్ధ

: నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి

* ఫిల్టర్ బెడ్ల పరిధిలో గల డివిజన్లలో నీటి సరఫరా పంపిణీ పై సుడిగాలి పర్యటనలు...
* పోచమ్మ మైదాన్ జంక్షన్ ప్రాంతం లో పరిశుభ్రత కు చర్యలు చేపట్టండి...
* నేడు (శనివారం) ప్రపంచ నీటి దినోత్సవం...



గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్, మార్చి 22(సమయం న్యూస్) : వేసవి లో నీటి సరఫరా పై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అన్నారు. నీటి సరఫరా పంపిణీ తీరు పై క్షేత్ర స్థాయి లో శనివారం దేశాయి పేట ఫిల్టర్ బెడ్ తో పాటు పుప్పాలగుట్ట, చార్ బౌలి వాటర్ ట్యాంక్ లను సందర్శించి వాటి పరిధిలో గల డివిజన్లలో నీటి సరఫరా తీరును అధికారులను అడిగి తెలుసుకొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించడం జరిగిందని ఇందులో భాగంగా నగరం వ్యాప్తంగా 66 డివిజన్ లలో ప్రత్యేకంగా చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. దేశాయిపేట ప్రతాప రుద్ర ఫిల్టర్ బెడ్ ఆకస్మికంగా సందర్శించిన మేయర్, 13,18,19,20,21,22,23,36 డివిజన్లలో నీటి సరఫరా తీరును అధికారులను అడిగి తెలుసుకుని నీటి నాణ్యతను పరిశీలించారు. దేశాయి పేట ఫిల్టర్ బెడ్ పరిధి లో 57 లీకేజీ లు గుర్తించి, 39 అరికట్టడం జరిగిందని, మిగతావి కూడా త్వరలోనే అరికట్టడం జరుగుతుందని, 3 ప్రాంతాల్లో నీరు కలుషితం అవుతున్నట్లు గుర్తించి, 2 ప్రాంతాల్లో అరికట్టమని మరో ప్రాంతం లో అరికట్టనున్నామని అధికారులు తెలిపారు. అనంతరం పోచమ్మ మైదాన్ జంక్షన్ లో బల్దియా నిర్వహిస్తున్న ఈసేవా కేంద్రం లో ఆకస్మికంగా తనిఖీ చేసి పన్ను వసూళ్ల తీరు తో పాటు ఎల్ ఆర్ ఎస్ చెల్లింపుల తీరు ను ఆపరేటర్ అడిగి తెలుసుకొని నిర్వహిస్తున్న రిజిస్టర్ ను పరిశీలించారు. మీ సేవ మొదటి అంతస్తును శుభ్రం చేయించి అందులో డివిజన్ లకు చెందిన శానిటరీ ఇన్స్పెక్టర్లు అర్బన్ మలేరియా సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆఫీసు ఏర్పాటు చేయాలని పబ్లిక్ టాయిలెట్ ప్రాంతాన్ని శుభ్రం చేయించి పూల కుండీలు ఏర్పాటు చేసి ఆ ప్రాంతం లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ టాయిలెట్ కు పెయింటింగ్ వేయించాలని దాని మీద స్వచ్ఛ సర్వేక్షన్ కు చెందిన కొత్త ప్రచార బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి గారి కోరిక మేరకు, మేయర్ పుప్పాల గుట్ట వాటర్ ట్యాంక్ ను సందర్శించి ఇట్టి పరిధి లోని 34,35 డివిజన్లలో నీటి సరఫరా తీరును అడిగి తెలుసుకోగా, ఆదర్శ కాలనీ లోని 1 2 3 గల్లీలలోని చివరి ప్రాంతాలకు నీరు సరిగా అందడం లేదని తెలుసుకుని, నీటిని అందించడానికి ప్రత్యేకంగా బోరు వేసి మోటర్ ద్వారా నీటిని అందిస్తామని తెలిపారు. చార్ బౌలీ వాటర్ ట్యాంక్ ను సందర్శించి ట్యాంక్ పరిధి లో గల 24,25,26,27,34,35 డివిజన్లలో నీటి సరఫరా జరిగే తీరును అడిగి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఉదయం 4:30 నుండే నీటి సరఫరా చేస్తున్నామని తెలుపగా మేయర్ అధికారులను అభినందించారు. చార్ బౌళి ట్యాంక్ ఆవరణ లో గల ప్రాంతాన్ని 23 రోజుల్లో శుభ్రం చేయడం తో పాటు వాటర్ ట్యాంక్ కు పెయింటింగ్ వేయించాలని టాయిలెట్ లు శుభ్రం గా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎలక్ట్రికల్ సంబంద మెటీరియల్ ను ముందు రూము లోకి తరలించాలని నర్సరీ ఏర్పాటు పైపులు అమర్చిన ప్రాంతం లో షెడ్డు వేసి డి ఆర్ సి సి అందులో నిర్వహించేలా చూడాలని మీ సేవా కేంద్రం వైపు నుండి డైరెక్ట్ గా డి ఆర్ సి సి కి చేరుకునేలా కాంపౌండ్ వాల్ నిర్మించాలని మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వ రాజు కుమార స్వామి ఈ ఈ శ్రీనివాస్ డి ఈ లు రంగారావు కృష్ణ మూర్తి ఏ ఈ లు విజయ లక్ష్మి హబీబ్ శానిటరీ ఇన్స్పెక్టర్ గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు

## పాఠశాలలు పునః ప్రారంభం నాటికి

# అత్యవసర మరమత్తులపై ప్రతిపాదన సిద్ధం చేయండి

**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ మార్చి22( సమయం న్యూస్):** శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఛాంబర్ లో అన్ని ప్రభుత్వ పాఠశాలల సంక్షేమ శాఖల, జిల్లా అధికారులతో పాఠశాలలు పునః ప్రారంభనానికి అత్యవసరం మరమ్మతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా శాఖను బలోపేతం చేసే దిశగా నాణ్యమైన గుణాత్మక విద్య అందించే దిశగా కార్పొరేట్ స్థాయిలో అన్ని వసతులు కల్పిస్తుందని జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో అవసరమైన అత్యవసర మరమ్మతులు ప్రతిపాదన సిద్ధం చేసి వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేసే విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. విద్యార్థులు కనిస అత్యవసర మరుగు దొడ్లకు మరమ్మత్తులు ప్రాధాన్యత ఇవ్వాలని, తాగునీరు సమస్య పై దృష్టి సారించాలని, రూఫ్ లీకేజీ, ప్లంబింగ్, డోర్స్ ,విండోస్ మరమ్మత్తులు చేయించాలన్నారు. అద్దె ప్రాతిపదికన నడుస్తున్న సంక్షేమ పాఠశాలలు వసతి గృహాల బిల్డింగ్స్ ఓనర్ తో మాట్లాడి మరమ్మతులు, మరుగుదొడ్లు, పూర్తి చేసి. విద్యార్థులకు ఉపయోగం లోకి తీసుకురావాలన్నారు. వసతి గృహాలు, పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత సీనియర్ అధికారికి వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, ఎస్సీ సంక్షేమ అధికారి చంద్రకళ, బీసీ సంక్షేమ అధికారి జగదీష్, సంబంధిత గురుకులాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు



ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించి జ్ఞాపిక, శాలువాల తో సన్మానించిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, dfo ప్రశాంత్ బాజీ రావ్ పాటిల్, సబ్ కలెక్టర్ యువరాజ్, జిల్లా అధికారులు, తదితరులు

# ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రాజెక్టు లకు భూసేకర వేగవంతం

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**
* **ఐడిఓసి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు.**



**జయశంకర్ భూపాల్ పల్లి మార్చి 22, (సమయం న్యూస్) :** జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాజెక్టులు రోడ్లు కు అవసరమైన భూసేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కాటారం, మహాదేవపూర్ మండలాల్లో ప్రాజెక్టుకు అవసరమైన అటవీ భూముల కేటాయింపు,అలాగే రేగొండ మండలంలో బుద్ధారం నుండి రామన్నగూడెం తండా వరకు రహదారి నిర్మాణానికి అవసరమైన భూముల కేటాయింపు విషయమై అటవీ శాఖ అధికారులతో సమీక్షించారు. అటవీ, రెవెన్యూ, సర్వే, ఆర్ అండ్ బి, మెగా ప్రాజెక్టు అధికారులకు అవసరమైన భూ కేటాయింపునకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, ఈ ఈ యాదగిరి, తహసీల్దార్లు, మెగా ప్రాజెక్టు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే మంచి భవిష్యత్

* **చించు ఘాట్ నిర్మాన్, సర్వీస్ నౌ సంస్థ దత్తత తీసుకున్న గ్రామాన్ని సందర్శించి, లైవ్ వుడ్ కిట్స్ లబ్ధిదారులకు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.**

**ఆదిలాబాద్ మార్చి22 (సమయం న్యూస్) :** శనివారం అదిలాబాద్ రూరల్ : శుక్రవారం అదిలాబాద్ రూరల్ చించుఘాట్ గ్రామాన్ని సందర్శించి మాట్లాడుతూ నిర్మాణ్, సర్వీస్ నౌ సంస్థ దత్తత తీసుకొని గ్రామాన్ని ఆదర్శ గ్రామం గా తీర్చిదిద్దుతున్నారని అభినందించారు. గ్రామంలో మౌళిక వసతుల తో పాటు విద్య, వైద్యం, ఆర్థికంగా అభివృద్ధి పథం లో ముందుకు వెళుతున్నదని, ఆ సంస్థ నుండి వచ్చిన 20 మంది గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆన్నారు. ఈ సందర్భంగా 34 కుటుంబాలు ఈ గ్రామంలో ఉన్నాయని, వీటితో పాటు 17 గ్రామాలను దత్తత తీసు కోవడం జరిగిందన్నారు. ఈ సంస్థ గత 5 సంవత్సరాల నుండి సేవలు అందిస్తున్నారని ఆన్నారు. దిశ మోడల్ స్కూల్ ద్వార నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందిస్తున్నారని , విద్యార్థులు మంచిగా చదువుకొని భావితరాలకు ఆదర్శంగా నిలవాలని, గ్రామాల నుండి ఐఏఎస్, ఐపీఎస్ లు కావాలని కోరారు. అనంతరం ఐరన్ తో చేసిన ఎడ్ల బండ్ల ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్, సంభందిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ కంపెనీల పేర్లతో

# నకిలీ పురుగు మందులు విక్రయిస్తున్న ముఠా అరెస్టు



**హన్మకొండ మార్చి 22( సమయం న్యూస్) :** అమాయక వ్యవసాయదారులను లక్ష్యంగా చేసుకోని ప్రముఖ కంపెనీల పేర్లతో పాటు గడువు తీరిన పురుగు మందులు విక్రయిస్తున్న ముఠాలోని ఏడుగురిని ప్రస్తుతం టాస్క్ ఫోర్స్ మరియు మట్టెవాడ పోలీసులు సంయుక్తంగా *అరెస్టు అరెస్టు చేయగా ఒక పరారీలో వుండగా, మరోకరు ప్రస్తుతం జైలులో వున్నారు. నిందితుల నుండి పోలీసులు వీరి నుండి సుమారు 78లక్షల 63వేల రూపాయల విలువ గల గడువు తీరున మరియు నకిలీ పురుగు మందులు, నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల తయారీ మిషనరీ, ప్రింటింగ్ సామగ్రి, రెండు కార్లు,ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన నిందితుల వివరాలు: 1.ఇరుకుల్ల వేదప్రకాశ్ (53),మట్టెవాడ,వరంగల్. 2. మహ్మద్ సిద్దిక్ ఆలీ (46),లక్ష్మీ పురం, వరంగల్. 3. నూక రాజేష్ ఆలియాస్ రాజు (40),సుల్తాన్‌బాద్,పెద్దపల్లి జిల్లా. 4. యల్లం సదాశివుడు(57), కరీంనగర్. 5.యం.డి రఫీక్(50), గొవిందరావుపేట, ములుగు జిల్లా. 6. ఆళ్లచేరువు శేఖర్ (37),మదుగు,ప్రకాశం జిల్లా.ఆ.ప్ర. 7.పొదిళ్ళ సాంబయ్య (55), దుగ్గొండి,వరంగల్ జిల్లా. 8. విష్ణు వర్ధన్ (ప్రస్తుతం పరారీలో వున్నాడు). 9.ముద్దగుల ఆదిత్య (32),హైదరాబాద్(ప్రస్తుతం జైలులో వున్నాడు). ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలు వెల్లడిస్తూ..పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ మరియు మట్టెవాడ పోలీసులు, వ్యవసాధికారులు సంయుక్తంగా కలిసి మట్టెవాడ బోడ్రాయి ప్రాంతంలోని ప్రధాన నిందితుడు ఇరుకుళ్ళ వేదప్రకాశ్ ఇంటిపై దాడి చేసి మరో ముగ్గురు నిందితులు సిద్ధిక్, రాజేష్, సదాశివుడులను పోలీసులు అదుపులోకి తీసుకోని ఇంటి నుండి పెద్ద మొత్తం నకిలీ మరియు గడువు తీరిన పురుగు మందులను స్వాధీనం చేసుకొని నిందితులను మట్టెవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనంతరం పోలీసులు నిందితులను విచారించగా. ప్రధాన నిందితుడైన ఇరుకుళ్ల వేదప్రకాశ్ సులభంగా డబ్బు సంపాదించాలనే అలోచనతో నిందితుడు స్థానికంగా వుండే పురుగు మందుల వ్యాపారస్తుల నుండి పెద్ద మొత్తంలో కాలం తీరిన పురుగు మందులను కోనుగొలు చేయడంతో పాటు స్థానిక పురుగు మందుల కంపెనీ ప్రతినిధి అయిన మరో నిందితుడు సిద్దిక్ వద్ద కొనుగొలు చేసేవాడు. ఈ విధంగా కొనుగోలు చేసిన గడుగు తీరిన పురుగు మందులతో పాటు, మరో ఇద్దరు నిందితులైన ఆళ్ళచెరువు శేఖర్, విష్ణువర్ధన్, ప్రస్తుతం జైలులో వున్న ఆదిత్యల నుండి ప్రముఖ పురుగు కంపెనీలైన దనూక, టాటా,ర్యైల్స్, బెయర్,అడ్మాతో పాటు మరికొన్ని కంపెనీ పేర్లతో తయారు చేసిన నకిలీ పురుగు మందులను కొనుగోలు చేసేవాడు. ఈ విధంగా సేకరించిన గడువు తీరిన పరుగు మందులతో పాటు, నకిలీ పురుగు మందులను ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేని మిగితా నిందితులకు విర్రయించాడు. ఈ నకిలీ పురుగుల మందులను కొనుగొలు చేసిన నిందితులు వీటిని స్థానికంగా వున్న వ్యవసాయదారులకు విక్రయిస్తూ మోసగించేవారు. పోలీసులు అరెస్టు చేసిన ప్రధాన నిందితుడితో పాటు సదాశివుడు, రాజు, ఆదిత్యలు గతంలోను పలు కేసుల్లో నిందితులుగా వున్నారు. ప్రధాన నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు ఆళ్ళచెరువు శేఖర్, విష్ణువర్ధన్‌ల గొడోల్లపై టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ పోలీసులు దాడులు పెద్ద మొత్తం నకిలీ పురుగు మందులు, వీటి తయారికి వినియోగించే యంత్ర సామగ్రి, లేబుళ్ళు, కల్తీ విత్తనాలు, రెండు కార్లు, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కల్తీ వ్యవహారాంలో నిందితులను పట్టుకొవడంలో ప్రతిభ కనబరిచిన టాస్క్ ఫోర్స్, వరంగల్ ఏసిపిలు మధుసూదన్, నందిరామ్ నాయక్, ఇన్స్పెక్టర్లు ఎస్. రాజు, గోపి, ఎస్.ఐలు వంశీకృష్ణ, నవీన్, ఆర్.ఎస్.ఐ భాను ప్రకాశ్ , ఏఏఓ సల్మాన్ పాషా, టాస్క్ ఫోర్స్ కానిస్టేబుల్స్ సురేష్, సురేందర్, సాంబరాజు, శ్రీనివాస్, సతీష్ కుమర్, నాగరాజులను పోలీస్ కమిషనర్ అభినందించారు.



## సిద్దిపేట్ నేషనల్ హైవే తొనిగండ్ల ఫారెస్ట్ బ్రిడ్జినీ పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ మార్చి22 (సమయం న్యూస్) :** శనివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా రామాయంపేట మండలం తొనిగండ్ల గ్రామ శివారు మెదక్ TO సిద్దిపేట N.H 765 DG 12 కిలోమీటర్లు బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పటిష్టంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలిక రోడ్డు త్వరగా ఏర్పాటు చేయాలని ఆదికారులను ఆదేశించిరు. అదే విదంగా కొత్తగా నిర్మించబోయే బ్రిడ్జ్ కు సద్యమైనంత త్వరగా అన్నీ అనుమతులు తెచ్చుకొని అతి వేగంగా వర్షాకాలం రాకముందే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ఫండ్స్ తెచ్చేది మేము.. ప్రారంభోత్సవాలు చేసేది మాత్రం ఎమ్మెల్యేలు

* **ప్రోటోకాల్ పాటించని నగర ఎమ్మెల్యేలపై ఫిర్యాదు : GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి..!!**

GHMC ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్ నర్సింహ్మా రెడ్డి గారు మాట్లాడుతూ.. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో మేయర్ మరియు కమిషనర్ గారితో కలిసి స్టాండింగ్ కమిటీ సమావేశంలో ప్రధానంగా నగరంలో జరుగుతున్న బిజెపి కార్పొరేటర్ల పై ప్రోటోకాల్ వివాదం మరియు నగర సమస్యలు మరియు ముందుగా వస్తున్న శ్రీరామనవమి పండుగకు సంబంధించిన ఏర్పాట్ల కొరకు నిధులకు కేటాయించాలని మరయు డివిజన్లోని ప్రధాన సమస్యలపై బీజేపీ కార్పొరేటర్లు అందరం కలిసి చర్చించడం జరిగింది.

**ఎమ్మెల్యేల పెత్తనం పెరిగిపోతుంది**

* 50.00 లక్షల లోపు పనులు కార్పొరేటర్ల అందరం ప్రారంభోత్సవాలు చేయాలనే తీర్మానం చేయాలి అని మేయర్ మరయు కమిషనర్ గారిని కోరడంతో వారు సానుకూలంగా స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆమోదం తెలుపుతామని అన్నారు.
* ప్రోటోకాల్ పాటించని నగర ఎమ్మెల్యేలపై ఫిర్యాదు చేశాం అన్నారు.
* ప్రారంభోత్సవాలకు కార్పొరేటర్ల ను పిలవడం లేదన్నారు.
* మాతోపాటు,మా కార్పొరేటర్ల అందరితో ప్రారంభోత్సవాలకు, అధికారులు ఎందుకు రావడం లేదు అని ప్రశ్నించారు.
* అధికారులను బెదిరించి ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చిన్నట్లు వ్యవహరిస్తున్నట్లు మేయర్, కమీషనర్ గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని అన్నారు.
* ఎమ్మెల్యేల స్థాయికి ఇచ్చిన గౌరవాన్ని నిలుపుకోకుండా కార్పొరేటర్ల ను పిలవకుండానే ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవాలు చేస్తున్నారు వాటిపై కూడా మీరు చర్యలు తీసుకోవాలని అన్నారు.



* ఈ కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్ల అందరూ పాల్గొన్నారు.

## ముగ్గురు చైన్‌స్నాచర్లతో పాటు

# ఒక దొంగను అరెస్టు చేసిన పోలీసులు

మూడు వేర్వేరు సంఘటనల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు చైన్ స్నాచర్లతో పాటు కారులో డబ్బు బ్యాగును చోరీ చేసిన కారు డ్రైవర్‌ను పోలీసుల అరెస్టు చేసారు. ఈ మూడు సంఘటనల్లో పోలీసులు సుమారు 4లక్షల 90వేల రూపాయల విలువగల, 77.750గ్రాముల బంగారంతో పాటు ఎనిమిది లక్షల పది వేల నగదు,ఒక ఆటో, ఒక ద్విచక్ర వాహనం,రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ అరెస్టులకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వివరాలను వెల్లడిస్తూ.

*** హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు వివరాలు**

ఈ కేసు సంబందించి పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు వరంగల్ కోట చెందిన చాపర్తి రాజేష్ (30) ఇస్త్రీ షాపు నిర్వహిస్తూ దీని ద్వారా వచ్చే అదాయం తన జల్సాలకు సరిపోకపోవడం నిందితుడు సులభంగా డబ్బు సంపాదించాలనే అలోచనతో చైన్ స్నాచింగ్ ద్వారా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 11వ తారీకున హనుమకొండ రెడ్డి కాలనీలో ఒంటరిగా వెళ్ళుతున్న ఓ మహిళ మెడలో వున్న రెండున్నర తూలాల బంగారు గొలుసును ద్విచక్ర వాహనంపై బలవంతంగా లాక్కోని అక్కడి నుండి తప్పించుకొని పోయాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న హన్మకొండ పోలీసులు, సిసిఎస్ పోలీసులతో కలిసి దర్యాప్తు చేసి ప్రస్తుతం పోలీసుల వద్ద వున్న టెక్నాలజీని వినియోగించుకోని నిందితుడుని పోలీసులు ఈ రోజు ఉదయం పెద్దమ్మగడ్డ ప్రాంతంలో అరెస్టు చేసి విచారించగా నిందితుడు గతంలో ఇదే తరహాలో నాలుగు చోరీలకు పాల్పడ్డాడు. ఇందులో కెయూసి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒకటి చోప్పున చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డాడు. నిందితుడి నుండి సిసిఎస్ పోలీసులు సుమారు 4లక్షల 75వేల రూపాయల విలువ గల బంగారం, పది వేల రూపాయల నగదు, ఒక ద్విచక్రవాహనం, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

*** కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు వివరాలు**

హన్మకొండ మార్చి22( సమయం న్యూస్) : ఈ కేసుకు సంబంధించి పోలీసులు అరెస్టు చేసిన నిందితులు తాళ్ళపల్లి సంపత్ కుమార్(39), ఐనవోలు, ప్రస్తుతం గోకుల్‌నగర్‌లో నివాసం, హనుమకొండకు చెందినవాడు కాగా మరో నిందితడు చుక్క మురళీ(26),నడికుడ గ్రామం, హన్మకొండకు చెందినవాడిగా పోలీసులు గుర్తించారు. నిందితుల్లో ఒకడైన సంపత్‌కుమార్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ, వచ్చిన డబ్బులతో బెట్టింగ్ యాప్‌ల ద్వారా బెట్టింగ్ కాసి డబ్బులు నష్టపోయి ఆటో రుణానికి సంబంధించి నెలసరి వాయిదాలు కట్టకపోవడం సులభంగా డబ్బు సంపాదించాలను కున్నాడు. ఈ కేసులోని మరో నిందితుడు ఇచ్చిన సలహా మేరకు ఈ ఇద్దరు నిందితులు నిన్నటి రోజున కిరాణ షాపులో బిస్కెట్ ప్యాకెట్ కొనుగోలు చేస్తున్నట్లుగా నటిస్తూ సదరు కిరణాం షాపు యజమానురాలి మెడలోని రోల్డ్‌గోల్డ్ గొలుసును లాక్కోని అక్కడి నుండి ఆటోలో పారిపోయారు. ఈ ఘటనపై కాజీపేట పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేపట్టి నేరం జరిగిన ఇరువై నాలుగ గంటలోపే నిందితులను ఈరోజు ఉదయం ఫాతిమా సెంటర్‌లో అరెస్టు చేసి వీరి నుండి రోల్డ్‌గోల్డ్ గోలుసుకున్న సూమారు 15వేల రూపాయల విలువ గల 2.750 గ్రాముల బంగారంతో పాటు ఒక ఆటో, ఒక సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేయూసి పోలీస్ స్టేషన్ పరిధిలో కారులో జరిగిన చోరీకి సంబంధించి వివరాలు...




పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు కార్తీక్ (35), కర్నాటక రాష్ట్రం, ప్రస్తుతం వనస్థలి పురం నివాసం వుంటున్నాడు. నిందితుడు గత రెండు సంవత్సరాలుగా హైదరాబాద్‌కు హోటళ్ళ వ్యాపారం నిర్వహించే చెందిన స్వాతి కిరణ్ వద్ద కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు.నిండితుడు జల్సాలకు అలవాటు పడ్డాడు. సులభంగా సంపాదించాలనుకున్న నిందితడు ఆవకాశం కోసం ఎదురు చూసాడు. ఇంటలో కారు యాజమాని తన వ్యాపార భాగస్వామి గూడమల్ల వినయ్‌కుమార్ కలిసి కారులో ఈ నెల 18వ తేదిన కాజీపేటకు చేరుకోని ఇక్కడే హొటల్ వ్యాపారం లావాదేవీల సంబంధించి 8లక్షల డబ్బు బ్యాగును తీసుకున్న బాధితుడు వినయ్‌కుమార్ డబ్బు బ్యాగును తాను ప్రయాణిస్తున్న కారులో వెనుక భాగంలో భద్రపర్చాడు. సూమారు రాత్రి 9గంటలకు భీమారంలో ఒక హోటల్‌లో రూం సేదతీరిన వ్యాపారస్తులు

నిందితుడైన కారు డ్రైవర్ భోజనానికి వెళ్యాతున్నట్లు వెళ్ళి కారులో వ్యాపారస్తులు భద్రపర్చిన ఎనిమిది లక్షల రూపాయల బ్యాగ్‌ను దొంగలించి అక్కడి నుండి పారిపోయినాడు. ఈ సంఘటనపై వ్యాపాస్తులు ఇచ్చిన ఫిర్యాదు అధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన కేయూసి ఇన్స్ స్పెక్టర్ రవికుమార్. టెక్నాలజీని వినియోగించుకోని ఈ రోజు ఉదయం హైదరాబాద్ వనస్థలిపురంలో నిందితుడుని అరెస్టు చేసిన అతని వద్ద వున్న 8లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. పై మూడు సంఘటనల్లో నిందితులను పట్టుకొవడం ప్రతిభ కనబరిచిన క్రైమ్స్ డిసిపి జనార్ధన్, సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమా,ఏసిపిలు మధుసూదన్,దేవేందర్ రెడ్డి, నంది రాం నాయక్, తిరమల్ ఇన్స్‌స్పెక్టర్లు బాలాజీ, సతీష్, రవికుమార్, సుధాకర్ రెడ్డి ఏఏఓ సల్మాన్‌పాషాతో పాటు సిసిఎస్, టాస్క్‌ఫోర్స్, హన్మకొండ, మట్వాడా, కాజీపేట పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్.ఐలు, ఇతర సిబ్బంది పోలీస్ కమిషనర్ అభినందించారు.

## మారుమూల ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్ ఏర్పాటు

*** ట్రోల్ ఫ్రీ నంబర్ 91005 77132**

నిర్మల్ మార్చి22( సమయం న్యూస్) : అధిక ఉష్ణోగ్రతల కారణంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల ప్రజల సహాయార్థం ప్రతి సోమవారం టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో 24.03.2025 నుండి ప్రతీ సోమవారం ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి తమ అర్జీలను సమర్పించేందుకు వీలుగా ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు టెలిఫోన్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రజలు తమ ఇంటి వద్ద నుంచే 91005 77132 ఫోన్ నంబర్ ను సంప్రదించడం ద్వారా నేరుగా తమ



సమస్యలను తెలిపి, దరఖాస్తులను వాట్సప్ ద్వారా పంపవచ్చునన్నారు. టెలిఫోన్ ప్రజావాణి ద్వారా స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, ఆన్ లైన్ లో నమోదు చేసి పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు యధావిధిగా సాధారణ ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని దూర ప్రాంత ప్రజలు టెలిఫోన్ ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## జిల్లా ఆర్యవైశ్య మహిళా అధ్యక్షురాలికి సన్మానం

**రణం శ్రీనివాస్ గౌడ్**

దౌల్తాబాద్, మార్చి23 సమయం న్యూస్ : సిద్ధిపేట జిల్లా ఆర్యవైశ్య మహిళ అధ్యక్షురాలు పబ్బ మాధవి అశోక్ లను శనివారం వారి స్వగృ హంలో దుబ్బాక నియోజకవర్గ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్ సన్మానించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ నిరుపేదల పెళ్లిలకు పుస్తె మట్టెలు దైవ కార్యక్రమాలు గ్రామంలోనైనా పరిసర ప్రాంతాల్లో ఎక్కడ జరిగిన హాజరై తోచినంత సహాయం చేస్తున్నారు. ఇలాంటి వారికి ఆ భగవంతుడు నిండు నూరేళ్లు చల్లగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వంచ జనార్దన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పులుగారి అంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## అకాల వర్షంతో అపార నష్టం..

*** దౌల్తాబాద్ మండలంలో 125ఏకరాల పంట నష్టం ..**

దౌల్తాబాద్, మార్చి 23 : దౌల్తాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వడగలుల వర్షాలతో చేతికొచ్చిన మొక్కజొన్న పంట నేలరాలడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది పరిస్థితి. దౌల్తాబాద్ మండలంలోని తిరుమలాపూర్. మహమ్మద్ షాపూర్. సూరంపల్లి. దొమ్మాట. ముబారస్ పూర్ తదితర గ్రామాల్లో యాసంగిలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట అకాల వర్షానికి ఆవిరైపోయింది. ఎంతో కష్టపడి యాసంగి సాగులో వేలది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేయగా చేతి కందే సమయంలో కండ్ల ముందే అకాల వర్షానికి కిందపడిపోవడంతో తమకు తీవ్ర నష్టం జరిగిందని ఆయా గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఓవైపు నీటి కొరత.. మరోవైపు అడుగంటిన భూగర్భ జలాలు.. నీటి కోసం భగీథ ప్రయత్నాలు చేసి పంటలు సాగు చేయగా కోతకు వచ్చే సమయంలో అకాల వర్షానికి నష్టం రావడంతో రైతులు కంటనీరు పెట్టుకుంటున్నారు. కాగా శనివారం మండల వ్యవసాయ అధికారి సాయి కిరణ్ తో పాటు ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో అకాల వర్షానికి నష్టపోయిన పంట వివరాలను సేకరించారు సుమారు 175 ఎకరాల్లో పంట నేల వాలిందని ఏవో పేర్కొన్నారు. కాగా రైతులను ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు పడాల రాములు. సీనియర్ నాయకులు బండారు లాలయ్య లు పేర్కొన్నారు.







## స్విమ్మింగ్ పూల్ నీ త్వరలో అందుబాటులోకి తేవాలి

*** అంబర్ పెట్ డివిజన్ మున్సిపల్ మైదానంలో గల స్విమ్మింగ్ పూల్ ని సందర్శించిన అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్**

అంబర్ పేట , మార్చి,22, సమయం న్యూస్: ఈ సందర్భంగా కార్పొరేటర్ స్విమ్మింగ్ పూల్ ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి వేసవి కాలం కావున పైగా విద్యార్థులకు సెలవులు వస్తుండడంతో త్వరితగతిన స్విమ్మింగ్ పూల్ ని మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరడం జరిగింది. అధికారులు కార్పొరేటర్ తో మాట్లాడుతూ ఒక వారం రోజుల్లో ప్రజలకి స్విమ్మింగ్ పూల్ ని అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్విమ్మింగ్ పూల్ సిబ్బంది మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాక నర్సింగ్ గంగపుత్ర,రాజు తదితరులు పాల్గొన్నారు

# పరీక్ష రాసి తిరిగొస్తుండగా రోడ్డు ప్రమాదం.. పదో తరగతి విద్యార్థిని మృతి

హైదరాబాద్, రాయదుర్గం: నగరంలోని గచ్చిబౌలి ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో పదో తరగతి విద్యార్థిని ప్రాణాలు కోల్పోయింది. వివరాల్లోకి వెళ్తే.. టీఎన్‌జీవో కాలనీకి చెందిన యువకుడు.. తన సోదరిని పదో తరగతి పరీక్ష రాయించేందుకు గచ్చిబౌలిలోని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లాడు. పరీక్ష రాసిన తర్వాత తిరుగు ప్రయాణంలో గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఆర్టీసీ డబుల్ డెక్కర్ బస్ కింద పడింది. ఈ ప్రమాదంలో విద్యార్థిని ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా.. ఆమె



అన్నకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన యువకుడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయదుర్గం పోలీసులు తెలిపారు.



# ఏరోపోనిక్ గార్డెనింగ్

**నేలవిడిచి సాగు చేయడం గురించి విన్నారా... ఇప్పుడు ఇదే ట్రెండ్... నీళ్లలో, కంటైనర్లలో, వర్టికల్‌గా తోటలను పెంచడానికి ఇష్టపడుతున్నారు మొక్కల ప్రేమికులు. వాటిల్లో భాగంగా వచ్చినదే ఏరోపోనిక్ గార్డెనింగ్. దీనిలో మట్టి అవసరం లేకుండానే... పీవీసీ పైపుల్నీ, స్టీల్ ఫ్రేమ్స్‌నీ ఉపయోగించి మొక్కల్ని పెంచొచ్చు. అయితే, ఈ పైపులు మొక్కల ఎదుగుదలకు ఆధారంగా మాత్రమే ఉంటాయి. వేర్లు మాత్రం గాల్లో ఉంటాయి. అదెలాగంటే...**

వేళ్ల కోసం తక్కువ బరువైన ఫ్రేమ్ లేదా ఫోమ్, స్పాంజ్‌లను వాడతారు. ఇవి పెంచాలనుకునే చోట కాంతి కోసం ఎల్ఈడీ లైట్లను అమరుస్తారు. వీటికి అవసరమైన నీటిని మిస్ట్ హ్యూమిడిఫయర్ల ద్వారా అందిస్తారు. బిందువుల ద్వారానూ నీళ్లు అందే ఏర్పాట్లు చేసుకోవచ్చు. తేమ, గాలి ప్రసరణ నియంత్రించేందుకు ఆటోమేటెడ్ సిస్టమ్స్ అందుబాటులో ఉన్నాయి. వేర్లు గాల్లో ఉండటం వల్ల ఆక్సిజన్ ఎక్కువగా అంది మొక్కలు వేగంగా పెరుగుతాయట. మిగతా పద్ధతులతో పోల్చితే దీనిలో 30శాతం అధికంగా మొక్కల పెరుగుదల ఉంటుంది. ఈ విధానంలో నీటి వినియోగమూ తక్కువే. ఇవి మట్టిలో ఉండవు కాబట్టి బ్యాక్టీరియా, ఫంగస్ లాంటి సమస్యలు తక్కువ. రసాయనిక ఎరువులు వాడాల్సిన అవసరమూ ఉండదు. టొమాటో, బంగాళదుంప, క్యాప్సికమ్, బీన్స్, పాలకూర, లెట్యూస్, మెంతికూర, దనియాలు, పుదీనా, తులసి, స్ట్రాబెర్రీ, రోజా, లిల్లీ, ఆర్కిడ్స్ వంటివన్నీ ఏరోపోనిక్స్ గార్డెనింగ్ పద్ధతిలో పెంచొచ్చు.

### ఎలా ప్రారంభించాలంటే...

ఈ పద్ధతిని అనుసరించాలనుకునే చోట... పీవీసీ పైపులు లేదా స్టీల్ ఫ్రేమ్‌ను ఉపయోగించి మొక్కలు పెట్టే స్థలం తయారుచేసుకోవాలి. సాధారణ తోటల పెంపకంలా ఒకే వరుసగా పేర్చుకోవచ్చు. లేదా, ఒకదానిపై ఒకటి ఫ్రేమ్‌లనూ అమర్చుకోవచ్చు. వీటికి నీటిని స్ప్రే చేసే మిస్టింగ్ నాజిల్స్ ఏర్పాటుచేయాలి.



నీటిలో నైట్రోజన్, పొటాషియం, ఫాస్ఫరస్ వంటి పోషకాలు కలపాలి. మొక్కకు ఆధారంగా హైడ్రోపోనిక్ ఫోమ్, స్పాంజ్ లేదా న్యూట్రియంట్స్ ప్యాడ్స్‌ను వాడాలి. తేమస్థాయి, ఉష్ణోగ్రతలు, నీటి పీహెచ్ లెవల్స్‌ను గమనిస్తుండాలి. ఇదంతా చేయడానికి సమయం లేదనుకుంటే వీటి రెడీమేడ్స్ ఆన్‌లైన్లో దొరుకుతున్నాయి. వంటగదుల్లో, హాల్లో, బాల్కనీల్లో పెంచుకుంటే ఆరోగ్యానికి ఆరోగ్యం... చూపరుల్నీ ఆకట్టుకుంటాయి.



# ఐదు వందల ఏళ్ల నాటి బావి..! ఆ నీళ్లు తాగితే అప్పట్లో..

**పురాతన శిల్పాలు, ఆనాటి కట్టడాలు గొప్పగొప్ప కథలెన్నో చెబుతుంటాయి. ఆనాటి రాజరికపు దర్పాన్ని, ప్రజా జీవన శైలిని కళ్లకు కడుతుంటాయి. అలాంటిదే కర్నూలు జిల్లా మండల కేంద్రం మద్దికెరలోని భోజరాజు బావి. ఇది సుమారు 5 వందల ఏళ్ల క్రితం పెద్దనగరి యాదవరాజులైన భోజరాజు తవ్వించారు. నాటి నుంచి నేటికీ గ్రామస్థులు, ఆ బావి నీటిని తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు.**

దాదాపు 70 అడుగుల లోతు, 80 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో నిర్మించిన ఈ బావి ఎన్నో ప్రాచీన విగ్రహాలతో ఆకట్టుకుంటుంది. ఈ బావిని ఎలాంటి మట్టి, ఇతర సామగ్రిని వినియోగించకుండా రాతి మీద రాతిని పేర్చి, హెచ్చుతగ్గులు కనిపించకుండా కట్టిన తీరు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ రాతి కట్టడంపై దేవతామూర్తులు, నర్తకుల నృత్యభంగిమలు, జలచర జీవుల రూపాలు, జలకన్యలు ఇలా వందలకొద్ది శిల్పాలు చాలా ప్రత్యేకంగా కనిపిస్తుంటాయి.

పదేళ్ల క్రితం వరకు గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ బావి నీటినే వినియోగించేవారు. కాలక్రమేణా నీళ్ల వ్యాపారం మొదలైననాటి నుంచి, ఎవరికి వారు, వాటర్‌క్యాన్స్ కొనుక్కుంటూ ఈ బావి నీటిని గృహ అవసరాలకు వాడటం మానేశారు. ప్రస్తుతం ఈ నీటిని వ్యవసాయానికి వినియోగిస్తున్నారు. 'అప్పట్లో ఈ నీళ్లు తాగితే మోకాళ్ల నొప్పులు ఉండేవి కావు, ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తేవి కావు' అని కొందరు గ్రామస్థులు చెబుతున్నారు.

### కరువులోనూ ఆదుకుంది..

దాదాపు 30 ఏళ్ల క్రితం ఈ ప్రాంతంలో కరువు ఏర్పడినప్పుడు మా వంశస్తులు నిర్మించిన భోజరాజు బావి ప్రజల దాహార్తిని తీర్చింది. ప్రస్తుతం 15 ఎకరాల వ్యవసాయ భూమికి ఈ బావి నీరే ఆధారమైంది



# నటి భాగ్య శ్రీ హెల్త్ టిప్స్: కాంతులీనే చర్మం, ఆరోగ్యం కోసం..!

**బాలీవుడ్ నటి భాగ్య శ్రీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఎప్పటికప్పుడు మంచి మంచి హెల్త్ టిప్స్‌ని షేర్ చేస్తూ ఆరోగ్య స్పృహని కలగజేస్తుంటుంది. అలాగే ఈసారి సరికొత్త హెల్త్ చిట్కాని నెట్టింట షేర్ చేసింది. అదే తన ప్రతిరోజూ ఉదయం తీసుకునే సూపర్‌ఫుడ్ అని చెబుతోంది. దీనివల్ల చర్మ, జుట్టు, ఆరోగ్యం బాగుంటాయని నమ్మకంగా చెప్పింది. ఇంతకీ అదేంటంటే..**

మెంతి గింజల ప్రయోజనాల గురించి చెప్పుకొచ్చింది ఇన్‌స్టాలో. నానబెట్టిన మెంతిగింజలు ఒక సూపర్ ఫుడ్ అని అది ఇన్సులిన్ స్థాయిలను నియంత్రిస్తుందని, రక్తాన్ని శుభ్రపరిచి..ప్రేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని అన్నారు. వీటిలో ఐరన్ పుష్కలంగా ఉంటుందని, అద్భుతమైన రోగనిరోధక శక్తిని అందిస్తాయని చెప్పుకొచ్చారు. వీటిని గనుక డైలీ లైఫ్‌లో భాగం చేసుకుంటే ఆరోగ్యంలో చక్కటి మార్పుని చూస్తారని అన్నారామె. ముఖ్యంగా కాంతులీనే చర్మాన్ని అందివ్వడంలోనూ, జుట్టు



ఆరోగ్యంలోనూ కీలకంగా ఉంటుందని పేర్కొంది. నిపుణులు ఏం అంటున్నారంటే.. మెరుగైన ఆరోగ్యాన్ని ఇవ్వడంలో మెంతుకు సాటిలేదని చెబుతున్నారు. దీని వల్ల కలిగే అద్భుత ప్రయోజనాల గురించి సవివరంగా వెల్లడించారు. అవేంటంటే..

* దీనిలోని ఫైబర్ కంటెంట్ కారణంగా మలబద్ధకాన్ని నివారిస్తుంది
* గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది
* బరువుని అదుపులో ఉంచుతుంది, ఆకలిని అరికట్టి జీవక్రియను మెరుగ్గా ఉంచుతుంది
* కీళ్ల నొప్పులు, ఉబ్బసం వంటి సమస్యలను తగ్గిస్తుంది
* మెరుగైన తల్లిపాల ఉత్పత్తిలో కీలకంగా ఉంటుంది.
* చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.
* కొలెస్ట్రాల్ స్థాయిని అదుపులో ఉంచుతుంది
* మొటిమలు, ముడతలను తగ్గిస్తుంది.
* జుట్టు రాలడం తగ్గుతుంది
* పీసీఓఎస్ సమస్యలు అదుపులో ఉంటాయి.
* శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి.



* కాగా, నటి భాగ్యశ్రీ గతంలో చర్మ సౌందర్యానికి ఉపయోగ పడే గ్రీన్‌జ్యూస్ ప్రయోజనాలను గురించి పంచుకున్నారు. తాజాగా మరో ఆరోగ్య చిట్కాతో మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలందించే మెంతులు గురించి నెటిజన్లతో షేర్ చేసుకున్నారు.

www.epapersamayam.com APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



# MOVIE TIME



## తెలుగులో సినిమా చేయకపోవడానికి కారణం అదే: విక్రమ్



టాకీస్: రంజిత్‌తో తంగలాన్ వంటి సూపర్ హిట్ అందుకున్న నటుడు చియన్ విక్రమ్ ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతున్నాడు. ఇందులో భాగంగానే ఆయన నటిస్తున్న ఒక చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. విక్రమ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'వీర ధీర శూరన్'. ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను హెచ్.ఆర్.పిక్చర్స్ బ్యానర్‌పై రియా శిబు నిర్మిస్తుంది. ఈ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌ను వదలగా మంచి స్పందన తెచ్చుకుంది. అయితే విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో తాజాగా తెలుగులో ప్రమోషన్స్ నిర్వహించింది చిత్రయూనిట్.

ఈ వేడుకకు నటులు విక్రమ్‌తో పాటు ఎస్‌జే సూర్య వచ్చి సందడి చేశారు. అయితే వేడుకలో ఒక రిపోర్టర్ విక్రమ్‌ని అడుగుతూ.. తెలుగులో స్ట్రెయిట్ సినిమాలు ఎందుకు చేయట్లేదని అడుగుతాడు. దీనికి సమాధానంగా విక్రమ్ మాట్లాడుతూ.. దానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి మంచి కథ దొరకకపోవడం. మరోకటి.. ఇండియన్ సినిమా ఇండస్ట్రీ ప్రస్తుతం వరల్డ్ వైడ్‌గా పాకడం. పాన్ ఇండియా సినిమాల వలన నేను తమిళంలో చేసిన సినిమాను మీరు తెలుగులో ఇక్కడ చూస్తున్నారు. తెలుగులో వచ్చిన సినిమాలను నేను ఓటీటీలో తమిళంలో చూస్తున్నాను. ఇలా ఎక్కడ చేసిన చూసే భాష ఒకటే అవుతుంది కాబట్టి తెలుగులో చేయడం లేదంటూ విక్రమ్ చెప్పుకోచ్చాడు. ఈ చిత్రంలో మలయాళ విలక్షణ నటుడు సూరజ్ వెంజరముడ్‌తో పాటు ఎస్.జె.సూర్య, దుశరా విజయన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

## నల్ల కలువ అవతార్‌లో 'త్రిప్తి డిమ్రి'




టాకీస్: 'యానిమల్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన 'త్రిప్తి డిమ్రి' గత ఏడాది బ్యాక్ టు బ్యాక్ మూడు సినిమాల్లో నటించింది. ముఖ్యంగా ఈమె నటించిన భూల్ భులయ్యా 3 సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. అయితే యానిమల్ సినిమాలో ఓవర్ డోస్ శృంగార సన్నివేశాల్లో నటించి గుర్తింపు దక్కించుకోవడం వల్ల అన్ని సినిమాల్లోనూ అలాంటి పాత్రల్లో నటించే అవకాశాలు వస్తున్నాయట. దాంతో త్రిప్తి సినిమాల ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరిస్తుంది. ఇటీవల ఒక స్టార్ హీరో సినిమాలో త్రిప్తి హీరోయిన్‌గా ఎంపిక అయి, ఆమెకు ఉన్న ఇమేజ్ కారణంగా తప్పించారనే వార్తలు వస్తున్నాయి. త్రిప్తి ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. ధడక్ 2 సినిమాతో పాటు ఇంకా టైటిల్ ఖరారు కానీ మరో సినిమాలోనూ త్రిప్తి ప్రస్తుతం నటిస్తోంది. ఆ రెండు సినిమాలతో ఈ ఏడాది బాక్సాఫీస్ వద్ద సందడికి సిద్ధం అవుతున్న త్రిప్తి తనపై ఉన్న ఇమేజ్‌ను తొలగించుకునే ప్రయత్నాలు చేస్తుంది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు వస్తే తప్పకుండా మెప్పిస్తాను అనే నమ్మకంతో ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అవకాశాల కోసం ఎదురు చూస్తున్నట్లు చెప్పుకొచ్చింది. సినిమాల్లో అందాల తారగా కంటే ఉత్తమ నటిగా గుర్తింపు దక్కించుకోవడం కోసం ఎదురు చూస్తున్నట్లు త్రిప్తి చెప్పుకొచ్చింది. అంతే కాకుండా ఈమె సౌత్ సినిమాల్లోనూ నటించేందుకు రెడీ అంటూ ఒక ఇంటర్వ్యూలో ఓపెన్‌గానే చెప్పుకొచ్చింది. సినిమాల్లో బిజీ బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం మనం చూస్తూ ఉంటాం. తాజాగా మరోసారి త్రిప్తి బ్లాక్ డ్రెస్‌లో సర్‌ప్రైజ్ చేసింది. పెద్దగా స్కిన్ షో చేయకుండానే స్టైలిష్ లుక్‌లో త్రిప్తి ఆకట్టుకుంది. బ్లాక్ డ్రెస్‌లో చూపు తిప్పనివ్వడం లేదంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్‌లో అందంగా ఉన్న త్రిప్తిని వెండి తెరపై శృంగార తార పాత్రలో చూసేందుకు ఎక్కువ శాతం మంది ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. ఫిల్మ్ మేకర్స్ సైతం అదే విధంగా ఆమెను చూపించాలని భావిస్తున్నారు. కానీ త్రిప్తి మాత్రం నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేసేందుకు ఎదురు చూస్తుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా బాలీవుడ్‌లోనే కాకుండా సౌత్‌లోనూ ఈ అమ్మడు సినిమాలు చేసే అవకాశాలు దక్కించుకుంటుంది అంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. యానిమల్ సినిమా విడుదలైన వెంటనే ఒక సౌత్ సినిమాలో ఈమెకు ఆఫర్ వచ్చిందనే టాక్ వచ్చింది. కానీ కొన్ని కారణాల వల్ల ఆ సినిమా పట్టాలెక్కలేదు. త్వరలోనే సౌత్‌లో ఈమె నటిస్తుందేమో చూడాలి. యానిమల్ సినిమాకు సీక్వెల్‌గా రాబోతున్న యానిమల్ పార్క్‌లో ఈమె పాత్ర ఏమైనా ఉండే అవకాశం ఉందా అంటూ పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## జయం తర్వాత నా కెరీర్‌లో మళ్లీ అలాంటి సినిమా 'ఎల్లమ్మ': నితిన్

టాకీస్: ఎల్లమ్మ సినిమా గురించి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు నటుడు నితిన్. తన కెరీర్‌లో జయం తర్వాత మళ్లీ అలాంటి సినిమా చేయబోతున్నానంటూ చెప్పుకోచ్చాడు. నితిన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్. ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నాడు. భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్. ఈ సందర్భంగా వరుసగా ప్రమోషన్స్ నిర్వహిస్తుంది చిత్రయూనిట్. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇంటర్వ్యూలో పాల్గోన్న నితిన్ తాజాగా తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్ ఎల్లమ్మ గురించి పంచుకున్నాడు.



ఎల్లమ్మ గురించి మాట్లాడుతూ.. ఎల్లమ్మ నా కెరీర్ లో జయం తర్వాత అంతకంటే లోకల్ రూటెడ్(గ్రామీణ నేపథ్యంలో) సినిమాగా రాబోతుంది. నేను ఎంత బాగా యాక్టింగ్ చేస్తే నాకు అంత పేరు వస్తుంది. ఇదోక మైల్ స్టోన్ సినిమా అని చెప్పవచ్చు. ఎల్లమ్మ అనే గ్రామ దేవత నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందంటూ నితిన్ చెప్పుకోచ్చాడు. ఈ సినిమాకు బలగం దర్శకుడు వేణు ఎల్దండి దర్శకత్వం వహించబోతుండగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మించబోతున్నాడు. సాయి పల్లవిని మొదటగా ఈ సినిమాకు కథానాయికగా అనుకోగా తాజాగా ఆమె తప్పుకున్నట్లు తెలుస్తుంది.

## హీరోతో డేట్ చేయకూడదని బాండ్ రాయించుకున్నారు: నిధి అగర్వాల్

టాకీస్: సవ్యసాచి సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది యువ కథానాయకి నిధి అగర్వాల్. ఈ సినిమా అనంతరం మిస్టర్ మజ్ను చేసిన కూడా రెండు సినిమాలు పెద్దగా బ్రేక్‌ని అందించలేకపోయాయి. అయితే పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్‌శంకర్'తో బ్లాక్‌బాస్టర్ హిట్ కొట్టేసింది ఈ భామ. ఆ తర్వాత తెలుగుతో పాటు తమిళ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఈ భామ తన కెరీర్ ప్రారంభంలో జరిగిన ఒక సంఘటన గురించి తాజాగా పంచుకుంది. తన మొదటి సినిమా టైంలో హీరోతో డేట్ చేయవద్దని చిత్రయనిట్ బాండ్ రాయించుకున్నారని తెలిపింది. బాలీవుడ్ సీనియర్ నటుడు జాకీ ష్రాఫ్ తనయుడు టైగర్ ష్రాఫ్ హీరోగా నటించిన 'మున్నా మైఖేల్' సినిమాతో బాలీవుడ్‌లో నా సినీ ప్రస్థానం మొదలైంది. ఈ సినిమాకు ఒకే చెప్పిన తర్వాత చిత్రయూనిట్ నాతో ఒక కాంట్రాక్ట్‌పై సంతకం చేయించింది. ఆ కాంట్రాక్ట్‌లో సినిమాకు సంబంధించి నేను పాటించాల్సిన నియమాలు ఉన్నాయి. అందులో'నో డేటింగ్' అనే షరతు కూడా ఉంది. దానికి అర్థం సినిమా కంప్లీట్ అయ్యేవరకు నేను హీరోతో నేను డేటింగ్ చేయకుడదని. అయితే ఇది చూడాకుండా నేను సంతకం పెట్టాను. తర్వాత ఈ విషయం తెలిసి నేను చాలా షాక్ అయ్యాను. నటీనటులు ప్రేమలో పడితే పనిపై శ్రద్ధ తగ్గుతుందని టీమ్ భావించి ఉంటుంది. అందుకే ఇలాంటి నిబంధనలు జోడించి ఉంటారని అనుకున్నానంటూ నిధి చెప్పుకోచ్చింది. సినిమాల విషయానికి వస్తే.. నిధి ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో కలిసి 'హరి హర వీరమల్లు' చిత్రంలో నటిస్తుంది. ఈ చిత్రం మే 09న ప్రేక్షకుల ముందుకు రానుంది.



## సూర్య రెట్రో నుంచి 'కనిమా' సాంగ్ రిలీజ్




టాకీస్: తమిళ నటుడు సూర్య దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు, కాంబోలో వస్తున్న తాజా చిత్రం రెట్రో. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. పూజా హెగ్డే కథానాయికగా నటిస్తుంది. మలయాళ నటుడు జోజు జార్జ్, కరుణకరణ్, జయరామ్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా మే 01న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు మేకర్స్. రెట్రో నుంచి 'కన్నమ్మ' సాంగ్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. సంతోష్ నారాయణన్ స్వరపరిచిన ఈ గీతంలో అదిరిపోయే స్టెప్పులతో సూర్య- పూజల జంట ఆడియన్స్‌ను ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. గ్యాంగ్‌స్టర్ మారిన ప్రేమికుడిని అతడి ప్రేయాసి ఎలా బయటికి తీసుకువచ్చింది. తన ప్రేయాసి కోసం కథానాయకుడు ఏం చేశాడు అనేది సినిమా స్టోరీ. సొంత నిర్మాణ సంస్థ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై తన భార్య జ్యోతికతో కలిసి సూర్య ఈ సినిమాను నిర్మిస్తున్నాడు.

## బాలీవుడ్ అంత వీజీ కాదని తేల్చేసిన భామలు!



### సౌత్‌లో స్టార్స్ అనిపించుకున్న హీరోయిన్స్ నార్త్‌లోను గట్టి ప్రయత్నాలు చేసిన బ్యూటీస్

టాకీస్: బాలీవుడ్‌కి శ్రీదేవి వెళ్లేవరకూ ఒక లెక్క .. వెళ్లిన తరువాత ఒక లెక్క అనే చెప్పుకోవాలి. సౌత్ ను ఒక రేంజ్ లో ఊపేసిన శ్రీదేవి ఆ తరువాత నార్త్ కి వెళ్లి, ఒక రేంజ్ లో సందడి చేసింది. శ్రీదేవి ఫీల్డ్ లో ఉన్నంత కాలం ఆమెను గురించి మాత్రమే మాట్లాడుకునేవారని అనడంలో అతిశయోక్తి లేదు. మాధురీ దీక్షిత్ .. ఐశ్వర్యారాయ్ లాంటి వారు వచ్చినా, శ్రీదేవిని మరిచిపోయేలా చేయలేకపోయారు. శ్రీదేవి తరువాత ఇక్కడి నుంచి వెళ్లి, అక్కడి వారిని ప్రభావితం చేసింది జయప్రద మాత్రమేనని చెప్పాలి.ఆ తరువాత కాలంలో హీరోయిన్స్ ఒకేసారి వివిధ భాషలో నటించడం మరింత ఎక్కువైపోయింది. తెలుగు .. తమిళ .. మలయాళ .. కన్నడ .. ఇలా ఎక్కడి నుంచి అవకాశం వచ్చినా వదలకుండా హీరోయిన్స్





సినిమాలు చేయడం మొదలుపెట్టారు. ఇక సౌత్ లో మంచి క్రేజ్ ఉంది గనుక, తాము ఉత్తరాదికి వెళ్లడానికి ఇదే కరెక్టు టైమ్ అన్నట్టుగా ఆ దిశగా ఓ అడుగువేశారు. అక్కడ పరిచయాలు పెంచుకుని పరిగెత్తడానికి ట్రై చేశారు. అలాంటి కథానాయికల జాబితాలో తమన్నా .. కాజల్ .. ఇలియానా .. శ్రుతి హాసన్ వంటి వారు ఉన్నారు.వీళ్లంతా కూడా తెలుగు .. తమిళ భాషల్లో స్టార్ స్టేటస్ ను అందుకున్నవారే. బాలీవుడ్ లో తమ హవాను కొనసాగించాలని భావించినవారే. అందరూ కూడా అడపాదడపా బాలీవుడ్ తెరపై అందంగా మెరిశారే తప్ప, చెప్పుకోదగిన స్థాయిలో తమదైన ముద్రను మాత్రం వేయలేకపోయారు. ఆలస్యంగానైనా అక్కడి వాతావరణాన్ని అర్థం చేసుకున్నారు. ఇక ఇప్పుడు అక్కడ పట్టు చిక్కించుకోవడానికి రష్మిక .. కీర్తి సురేశ్ ..గట్టిగానే ట్రై చేస్తున్నారు. సీనియర్ హీరోయిన్లను ఒక మాట అడిగితే, అదంతా వీజీ కాదని ఈ పాటికే చెప్పేవారేమో.



Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.